వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 05 డిసెంబర్ 2024

## విరగ్గాసిన పనస

### ఒక్కోచెట్టుకు వందకు పైగానే కాయలు

**మదనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** మదనపల్లె రూరల్ పరిధిలోని చెంబకూరుకు వెళ్లే మార్గంలోని ఓ రైతు పొలంలో ఉన్న పనసచెట్టు కాయలను విరగ్గాసింది. చెట్టు మొదలునుంచి పైకొమ్మల వరకు గుత్తుల గుత్తులుగా కాయలను కాసింది. ఒక్కోచెట్టు వందకు పైగా కాసింది. మదనపల్లె-చెంబకూరు మార్గం పక్కనే ఈ చెట్టు ఉండడంతో ప్రయాణీకులకు దర్శనమిస్తున్నాయి. చెట్టునిండా కాయలు ఉండడంతో ప్రయాణీకులు అబ్బో పనసకాయలు ఏం విరగ్గాసిందంటూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. రైతుకు ఓ రకంగా ఈచెట్లు వల్ల మంచి ఆదాయమే వస్తోంది.



## రాజంపేట ఏజీపీగా మౌనిక

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 04, ప్రభాతవార్త:** రాజంపేట జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు అసిస్టెంట్ గరవ్నమెంట్ ప్లీడర్‌గా పచ్చా మౌణికను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మౌణిక నియామక పత్రాన్ని న్యాయమూర్తికి అందజేశారు. అనంతరం ఏజీపీగా బాధ్యతలు కూడ చేపట్టారు. మౌణిక తండ్రి హనుమంత నాయుడు రాజంపేట బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టీర్ చేస్తున్నారు.



# పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం

: రేషన్ షాపులోనే కొనుగోలు

: బద్వేలు- పోరుమామిళ్లలో రెచ్చిపోతున్న బియ్యం మాఫియా

: ప్రతి ఒక్కరికీ మాములు

: అన్నీ తెలిసినా పట్టించుకోని అధికారులు

**బద్వేలు, డిసెంబర్04 ప్రభాతవార్త :** పేదలకు ఇచ్చే రూ.2ల బియ్యం పక్కదారి పడుతోంది. బద్వేలు, పోరుమామిళ్లలోబియ్యం మాఫియా రెచ్చిపోతున్నారు. 1వ తేది ప్రారంభమైన వెంటనే రేషన్ షాపులో బియ్యాన్ని పంపిణీ చేస్తున్న సమయంలోనే కొనుగోలు చేసి స్టాకు ఉంచుకుని తర్వాత అధిక రేట్లకు మాఫియాకు అమ్ముకుంటున్నారు. 1వ తేది నుంచి 10వ తేది వరకు రేషన్‌షాపులలో బియ్యం పంపిణీ పూర్తి అయ్యాక వీధులలోకి వెళ్లి గ్రూపులుగా కొనుగోలు చేసి మాఫియా చేతిలో పెడుతున్నారు. వాటిని రైస్‌మిల్లుల్లో పాలిష్ పట్టి బద్వేలు , పోరుమామిళ్ల నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. పోరుమామిళ్లలో బియ్యం మాఫియా డాన్ కోట్లకు పడగలెత్తారు. అధికారులకు తెలిసినా అధికారులకు తెలిసినా మాముళ్ల తీసుకుని సరిపెట్టుకుంటున్నారు. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు బియ్యం మాఫియా డాన్ మాముళ్లతో సరిపెట్టి వారి పనిని సులభతరం చేసుకుంటున్నారు. రాత్రి సమయాలలో బియ్యాన్ని ఎవరికంటా పడకుండా తరలిస్తున్నారు. చెక్ పోస్టు దాటితే పట్టించుకునే నాధుడే లేడు. చెక్ పోస్టు వరకు జాగ్రత్తగా చూసుకుని తర్వాత నేరుగా గమ్యాన్ని చేర్చుకునే మార్గాన్ని ఎంచుకున్నారు. బద్వేలులో కొత్తగా మరో ఇద్దరు బియ్యం మాఫియా డాన్‌లు తయ్యారయ్యారు. బద్వేలు, గోపవరం, బి.కోడూరు , అట్లూరు మండలాలలోని గ్రామాల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి వారు ఏర్పాటు చేసిన గోడౌన్‌కు తరలిస్తున్నారు. అక్కడినుంచి బియ్యాన్ని సంచులలో మార్పులు చేసి ఎవరికీ అనుమానం రాకుండా ఉండేలా తరలిస్తున్నారు. బద్వేలు పట్టణంలో శివాలయం వద్ద ఒక నాయకుడు గోడౌన్ ఏర్పాటు చేసుకోగా గుంతపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఏకంగా మిల్లులోనే రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచి బియ్యాన్ని పాలిష్‌చేసి ఎగుమతి చేస్తున్నారు. పట్టణంలో ఏ ఒక్కరిని అడిగినా బియ్యాన్ని కొనుగోలు చేసే వ్యక్తుల పేర్లు బట్టబయలు చేస్తారు. ఇంత తెలిసినా మన అధికారులు మాత్రం ఏమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. నిత్యం బద్వేలు, పోరుమామిళ్ల నుంచి టన్నుల కొద్ది బియ్యం ఎగుమతి అవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఒక పక్క రెవెన్యూ, మరోపక్క ఎన్‌ఫోర్సు మెంట్, ఇంకోపక్క పోలీసుల నుంచి తప్పించుకుని బియ్యం ఎగుమతి అవుతున్నాయంటే అధికారులకు తెలియదా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వేల క్వింటాళ్లు బియ్యం, బద్వేలు , పోరుమామిళ్ల నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యి బ్లాక్ మార్కెట్ అవుతుంటే మన అధికారులు నిద్రపోతున్నారా అన్నట్లుగా కనపడుతోంది. రేషన్‌షాపు బయటే బియ్యం కొనుగోలు చేసినా రేషన్‌షాపు ఇచ్చే డీలరే బియ్యం కొనుగోలుచేసినా స్థానిక అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టపగలే బియ్యాన్ని కొనుగోలు చేసినా అడిగే నాధుడు లేడు. ఇంత జరుగుతుంటే మన అధికారులు మాత్రం ఎక్కడ జరుగుతున్నాయని ఇతరులనే ప్రశ్నవేసే పరిస్థితి ఏర్పడుతుంది.



### 600బస్తాలు రేషన్ బియ్యం పట్టివేత :

మైదుకూరు నుంచి నెల్లూరు క్రిష్ణపట్నంకు పోర్టుకు వెళ్తున్న రేషన్ బియ్యాన్ని అధికారుల స్వాధీనం చేసుకున్నారు. రాబడిన సమాచారం మేరకు వీరారెడ్డి కళాశాల వద్ద లారీని ఆపి తనిఖీ చేపట్టగా అందులో 600 బియ్యం బస్తాలు ఉన్నట్లు ఎన్‌ఫోర్సు మెంటు అధికారులు గుర్తించారు. వెంటనే పోలీసుస్టేషన్‌కు తరలించారు.అక్కడ ఎన్‌ఫోర్సు మెంటు అధికారులు బియ్యాన్ని శాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపారు. ఇవి పక్కా రేషన్ బియ్యం అనివీటిని పోర్టుకు తరలించి ఎగుమతి చేసేందుకు నిత్యం పదుల సంఖ్యలో మైదుకూరు నుంచి బద్వేలు మీదుగా పోతున్నట్లు సమాచారం.ఉన్నతాధికారుల సమాచారంమేరకే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్సు మెంటు అధికారులు తెలిపారు. ఈ రేషన్ బియ్యం మైదుకూరుకు చెందిన ఒక పార్టీ నాయకుడివని మైదుకూరులో గుర్తింపు పొందిన ట్రేడర్ నుంచి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## ఉపాధ్యాయుడు మందలించాడని చంపిన విద్యార్థులు

### తరగతి గదిలోనే జరిగిన ఈ దారుణం..

**రాయచోటి , డిసెంబర్ 4 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లాలోని రాయచోటి పట్టణం కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడి పై తొమ్మిదవ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు తరగతి గదిలోనే దాడికి పాల్పడ్డారు. ఈ దాడి వల్ల ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు తెలిసింది. వివరాల్లో కెళితే పిల్లలు అల్లరి చేస్తుంటే ఎజాజ్ అనే ఉపాధ్యాయుడు ఒక వేటు వేయడంతో అన్నదమ్ములు ఇద్దరూ, ఫ్రెండ్స్ ఇద్దరీతో కలిసి రౌండ్ రింగుతో కొట్టడం జరిగిందని సమాచారం హార్ట్ స్ట్రోక్ గాని, మరి కొట్టడం ఎక్కడ కొట్టారో తెలీదు కానీ ఆ ఉపాధ్యాయుడు చనిపోవడం జరిగింది. విద్యార్థుల మధ్య జరుగుతున్న ఘర్షణ ఆపిన ఉపాధ్యాయుడు.ఇద్దరు అన్నదమ్ములు మరొక విద్యార్థి కలిసి ఇతర విద్యార్థుల మీద దౌర్జన్యం చేసిన సందర్భంలో వారిని అడ్డుకున్న ఉపాధ్యాయుడు దీంతో ..ఒక్కసారిగా ఉపాధ్యాయుడి పై ఆ ముగ్గురు పిడిగుద్దులతో చెస్ట్ మీద , ముఖం మీద దాడికి పాల్పడటంతో కళ్ళద్దాలు కూడా విరిగిపోయిన పరిస్థితులలో మిగిలిన విద్యార్థులు విడిపించగా తీవ్ర ఆవేదనలో ఒక్కసారిగా కుప్పకూలిపోయిన ఉపాధ్యాయుడు. వెంటనే ఆసుపత్రిలో చేర్చిన తోటి ఉపాధ్యాయులు. కాసేపటికే ప్రాణాలు కోల్పోయిన హృదయ విషాదకర, విచారకంమైన ఈ సంఘటనను ఏ విధంగా అర్థం చేసుకోవాలో ఉపాధ్యాయ సమాజం విశ్లేసించుకోవాలి. ఎటు పోతోంది నేటి యువత అని రాయచోటి పట్టణవాసులు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా పిల్లల పట్ల తమ తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టకుండా చొరవ తీసుకోకుండా ఉన్నట్లయితే వారు బావి తరాలకు భవిష్యత్తు లేకుండా పోతారు అనే దానిపై పలువురు చర్చించుకుంటున్నారు.



### తల్లి నుంచి దూరమైన పిల్లలను...

## తిరిగి తల్లి దగ్గరకు చేర్చిన సబ్ కలెక్టర్

### అభినందించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 04 ప్రభాతవార్త**

రాజంపేటలో తల్లి దగ్గర నుంచి దూరం చేసిన పిల్లలను తిరిగి తల్లి దగ్గరకు చేర్చేందుకు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవీని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రత్యేకంగా అభినందించారు. రాజంపేటకు చెందిన నజ్మా, చైతన్య పాఠశాలలో చదువుతున్న తన పిల్లలను వారి తండ్రి తనకు తెలియకుండా పాఠశాల నుంచి తీసుకెళ్లిపోయాడని నిస్సహాయ స్థితిలో ఉన్నానని సహాయం చేయవలసిందిగా సబ్ కలెక్టర్ నైదియా దేవికి ఆవేదనతో విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్, పిడి ఐసిడిఎస్, సిడిపిఓ ,రాజంపేట పోలీసు సిబ్బందితో ప్రత్యేక టీం ను ఏర్పాటు చేశారు. ఈ బృందం బెంగుళూరు వెళ్లి పిల్లలను తీసుకువచ్చి పిల్లల తల్లికి డిసెంబర్ బుదవారం అప్పగించారు. సబ్ కలెక్టర్ అదేశాలతో సత్వరం స్పందించి చాకచక్యంగా పిల్లలను తల్లి దగ్గరకు చేర్చిన బృంద సభ్యులు వై హరినాథ్ (కానిస్టేబుల్), రమణ (కానిస్టేబుల్), సాదిక్ నిసా (వన్ స్టాప్ సెంటర్, రాయచోటి), శైలజ (సోషల్ వర్కర్, జిల్లా పిల్లల రక్షణ యూనిట్, రాయచోటి) లను రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి అభినందించారు. ఈ సందర్భంగ వెంటనే చర్యలు చేపట్టి పిల్లలను తల్లి దగ్గరికి చేర్చిన రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



### 2254 కోట్ల వ్యయంతో చేపట్టిన...

# కడప-రేణిగుంట జాతీయ రహదారి ప్రాజెక్టు టెండర్లు రద్దు?

- తాజాగా జాతీయ రహదారికి ఫారెస్ట్ క్లియరెన్స్
- నిర్మాణం పనులు ప్రారంభించేందుకు మీన మేషాలు ఎందుకు?
- గ్రావెల్ సాకుతో తప్పుకునేందుకు నిర్మాణ సంస్థ లేఖ?
- తుది నిర్ణయం జాతీయ రహదారి మంత్రిత్వ శాఖదే
- కేంద్ర మంత్రి 'నితిన్ గడ్కరి' చేతిలో రహదారి భవితవ్యం

**రెండేళ్లలో పూర్తి కావాల్సిన ఓ జాతీయ రహదారి ప్రాజెక్టు నిర్మాణ పనులు రెండేళ్లు పెండింగ్‌లో పడ్డాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న గత పాలక పక్షం పట్టించుకోకపోవడం వివిధ కారణాలతో అటవీ శాఖలో సుమారు ఏడాదిన్నర పాటు పెండింగ్‌లో పడింది. తీరా రహదారి నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చిన తర్వాత నిర్మాణ సంస్థ వైదొలుగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జాతీయ రహదారి నిర్మాణం పనులు కేంద్ర జాతీయ రహదారి మంత్రిత్వ శాఖ(ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయంపై ప్రతిష్టంబన నెలకొంది. కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరి తీసుకునే నిర్ణయం బట్టి కడప-రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణం పనుల భవిష్యత్తు ఆధారపడి ఉందని సమాచారం.**



కడప-రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 04, ప్రభాతవార్త:** కడప-రేణిగుంట జాతీయ రహదారి 716 నిర్మాణం పనులను ఎన్‌హెచ్‌ఏఐ చేపట్టింది. 2022లో ఈ ప్రా జెక్టు మంజూరైంది. ఇదే సంవత్సరం అక్టోబర్ 21న టెండర్లు జరిగాయి. ప్రాజెక్టును 122కిలో మీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణాన్ని గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేగా నిర్మించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ రెండు ప్యాకేజ్‌లుగా విభజించింది. మొదటి ప్యాకేజ్‌ని 64.2కిలో మీటర్లు నిర్మించేందుకు 1245.66కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. మొదటి రీచ్ కడప పట్టణంలోని జేఎంజే సర్కిల్ వద్ద నుంచి ఓబుళవారి పల్లె మండలంలోని చిన్న ఓరంపాడు వరకు నిర్మించాల్సి ఉంది. 2వ ప్యాకేజీని 1053.39 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. రెండు ప్యాకేజీలను విజయవాడకు చెందిన లక్ష్మి ఇన్‌ఫ్రా సంస్థ అంచనా వ్యయం కంటే తక్కువకు టెండర్లను కైవసం చేసుకుంది. 1వ ప్యాకేజీని 1222.11, 1032.32 కోట్ల వ్యయంతో పనులు లక్ష్మి ఇన్ ఫ్రా సంస్థ చేజిక్కించుకుంది. 57.7కిలో మీటర్ల పొడువైన దూరం నాలుగు వరుసల రహదారిని చిన్న ఓరంపాడు నుంచి రేణిగుంట చెక్‌పోస్ట్ వరకు నిర్మించాల్సి ఉంది. ఈ మొత్తం ప్రాజెక్టులో రైల్వే కోడూరు మండలంలోని శెట్టిగుంట దగ్గర 2.5కిలో మీటర్లు, మామండూరు వద్ద 2.3 కి.మీ, రేణిగుంట వద్ద 3.2కి.మీ, బైపాస్ రోడ్డు నిర్మించేందుకు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఆకృతులు సిద్ధం చేశారు. అలాగే 2రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, 92సర్విస్ రోడ్లు, 43 అండర్‌పాస్‌లు నిర్మించాల్సి ఉంది. ఈ మేరకు రహదారి నిర్మించేందుకు 1066ఎకరాల భూమిని సేకరించారు. దాదాపు భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి నష్టపరిహారం కూడ చెల్లించారు. వివిధ కారణాలతో తక్కువ ధర అని కొందరు మాత్రమే నష్ట పరిహారం తీసుకునేందుకు విముఖత చూపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మామండూరు వద్ద ఎక్కువ శాతం అభయారణ్యంలో రోడ్డు నిర్మించాల్సి ఉండటంతో కేంద్ర అటవి శాఖ అనుమతులు తీసుకోవాల్సి వచ్చింది. గత నెలలో ఫారెస్ట్ క్లియరెన్స్ కూడ లభించింది. ఆ తర్వాత పలు చోట్ల పనులు ప్రారంభించాల్సి ఉండగా గ్రావెల్ సంస్థను సాకుగా చూపి సంస్థ పనులు ప్రారంభించేందుకు వెనకడుగు వేసినట్లు సమాచారం. రహదారి పనులు చేఉపట్టేందుకు అవసరమైన గ్రావెల్ ఒంటిమిట్ట చెరువులో మాత్రమే ఉందని మిగతా చోట్ల కూడ గ్రావెల్‌ను సమకూర్చాలని అనుమతులు ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకి నిర్మాణ సంస్థ లేఖ రాసినట్లు తెలిసింది. లేదంటే పనులు చేపట్టలేమని కూడ లేఖలో పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా రెండేళ్లలో పూర్తి కావాల్సిన కడప-రేణిగుంట నాలుగు వరుసల రహదారి నిర్మాణం రెండేళ్ల తర్వాత కూడ ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిర్మాణ వ్యయం భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. అందుకే నిర్మాణ సంస్థ తప్పుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ నిర్మాణ సంస్థతో సంప్రదింపులు జరిపి పెరిగిన వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని పనులకు అనుమతులు ఇస్తుందా లేక టెండర్లలో రెండవ స్థానంలో ఉన్న నిర్మాణ సంస్థకు అప్పగిస్తుందా లేదంటే పూర్తి స్థాయిలో టెండర్లు రద్దు చేసి కొత్తగా మరళా టెండర్లు పిలుస్తుందా అనే విశయం వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా రెండు జిల్లాలకు అతి ముఖ్యమైన ఈ జాతీయ రహదారి నిర్మాణం పనులు పెండింగ్‌లో పడటంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న జాతీయ రహదారిని అభివృద్ధి చేసి వాహణదారులకు ఇబ్బంది లేకుండా కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడ కడప-రేణిగుంట జాతీయ రహదారి ప్రాజెక్టు త్వరగా పట్టాలెక్కేలా చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### భవిష్యత్తులో భూ సమస్యలు లేకుండా

## రైతు సదస్సులను నిర్వహించాలి

**రాయచోటి, డిసెంబర్ 4 ప్రభాతవార్త**

డిసెంబర్ 06 నుండి జనవరి 08 వరకు జిల్లాలోని ప్రతి గ్రామంలో నిర్వహించబోయే రెవెన్యూ సదస్సులను భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా విజయవంతంగా నిర్వహించాలి. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అన్ని మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందితో రెవెన్యూ సదస్సులు, పల్లె పండుగ పనులు, నీటి పన్ను తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని అన్ని గ్రామాలలో రెవిన్యూ సదస్సులను నిర్వహించాలని, భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఒక రెవెన్యూ గ్రామంలో రెండు గ్రామపంచాయతీలు ఉంటే రెండు సభలను నిర్వహించేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించామని ఈ నోడల్ అధికారులు ఎమ్మార్వోలు ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ సదస్సు జరగబోయే గ్రామంలో టామ్ టామ్, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. ఏ రోజు ఏ గ్రామాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించబోతారో ముందుగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని పత్రికా ప్రకటన ద్వారా ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. రెవెన్యూ సదస్సు జరిగే చోట షామియానా, నీటి వసతి, కంప్యూటర్లు, ప్రింటర్లు లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమాలపై సమీక్షిస్తూ కొన్ని మండలాలలో పూర్తికాని పనులను ఎంపీడీవోలు త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలపై ఆయన అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ రోడ్లంటే హడల్... పట్టించుకోని అధికారులు

**నిమ్మనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** నిమ్మనపల్లె మండలంలో గ్రామీణ రోడ్లంటే ఆర్టీసి హడలిపోతోంది. రోడ్లు గురించి ఆర్అండ్, పంచాయితీరాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి దుస్థితికి చేరుకొంటున్నాయి. ఈ రోడ్లల్లో బస్సులు తిరగకపోవడంతో విద్యార్థులు చదువులకు స్వస్తి పలుకుతున్నారు. రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తరలించలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన రోడ్లల్లో చింతపర్తి, తవళం, వాల్మీకిపురం,కందూరు రోడ్లు ప్రదానమైనవి. ఈ రోడ్లు ఎప్పుడు బాగుపడుతాయా అని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ మార్గాల్లో ఆర్టీసి తప్పా ప్రైవేటు బస్సులు తిరగవు దీంతో మారుమూల గ్రామాల విద్యార్థులు కిలోమీటర్ల మేరా నడిచి వెళ్ళి చదువుకోలేకపోతున్నారు. ఆటోల ద్వారా దూరం వెళ్ళి చదువుకోలేక పెద్దసంఖ్యలో బాలికలు చదువులను మద్యలోనే ఆపివేయాల్సి వస్తోంది. ఈ కారణంగా అనేక మంది నిరక్ష్యరాస్యులగా మారుతున్నారు. ఇక రైతులు పండించిన పంటలను మార్కెట్‌లకు తరలించలేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధి దృష్టి సారించాల్సిన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్ల పల్లె ప్రజలు అన్ని రకాల్లోనూ వెనుకబడి పోతున్నామంటున్నారు. మండలంలో 157 పల్లెలు ఉన్నాయి. ఈ పల్లెల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులు 500మంది, హైస్కూల్స్‌కువెళ్లే విద్యార్థులు 1200మంది ఉన్నట్లు సమాచారం. మండలంలో 9ప్రదాన రహదారులు మాత్రమే ఉన్నాయి. తక్కినవన్నీ ఆటోలు తిరుగుతాయి. ఈ రోడ్లుల్లో రాత్రి సమయాల్లో ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉందని ప్రజలు కోరుతున్నారు. రోడ్లు ఇంత అద్వాన్నంగా ఉన్న సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లన్నీ ఆర్అండ్‌బి పరిధిలోకి తీసుకెలితే కొంతవరకైనా వాటికి మోక్షం కలుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. మండలంలో గుండ్లబురుజు, కొమ్మిరెడ్డిగారిపల్లె-తవళం, చౌకిళ్ళవారిపల్లె రోడ్లన్నీ అధ్వాన్నంగా మారాయి.



కొద్దిపాటి వర్షానికి గుంతలమైయమైన రోడ్లు



వర్షంతో రోచ్చురోచ్చుగా ఏర్పడిన గ్రామీణ రోడ్లు

## మినుములో పల్లాకు తెగులు

**దువ్వూరు, డిసెంబర్ 04, ప్రభాతవార్త:** రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము పంటలో పల్లాకు తెగులు ఉందని దీని నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా చిన్న సింగనపల్లె గ్రామంలో ఆయనపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రబి పంట కాలానికి మినుము పంట విస్తారంగా సాగు చేసి ఉన్నారని, పంటలో పల్లాకు తెగులు అక్కడక్కడ ఆశించి ఉన్నదని తెలిపారు. అదేవిధంగా ఉల్లిపంటలో వేరు కుళ్లు తెగులు నివారణ తెలియజేశారు. రబీలో సాగు చేసిన వేరుశనగ, మినుము, నువ్వులు, జొన్న పంటలకు పంటల భీమా చేసుకోవాలని తెలిపారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ విత్తనోత్పత్తిలో కంపెనీల నుంచి అగ్రిమెంట్ తీసుకోవాలని రబిలో సాగు చేసిన అన్ని పంటలు పంట నమోదు అనగా ఈ క్రాప్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు గంగా మరియు రైతులు పాల్గొన్నారు.



## ఆరో తేదీ నుండి రెవిన్యూ సదస్సులు

వీరబల్లి, డిసెంబరు04, ప్రభాత వార్త:

మండలంలో ఈనెల 6తేదీ నుండి జనవరి 7 తేదీ వరకు రెవిన్యూ సదస్సులు నిర్వహించబడునని మండల తాసిల్దార్ శ్రావణి తెలిపారు. ఈ రెవిన్యూ సదస్సులో ప్రజలకు గాని రైతులకు గాని ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించబడునని ఆమె చెప్పారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన భూ సమస్యలు ఏవైనా ఉంటే ఈ సదస్సులో పరిష్కరించబడతాయని ఆమె ఆన్నారు. ఈ సదస్సులు షెడ్యూలు ఈ విధంగా ఉన్నాయి. ఈనెల 6,7 తేదీలలో గడుగోట ఎడబల్లె గ్రామాలలో సచివాలయం దగ్గర రెవెన్యూ సదస్సులు నిర్వహించబడును అన్నారు అదేవిధంగా, 10,11 తేదీలలో వంగిమల గ్రామంలో, 13వ తేదీలలో దిగురాచపల్లి పంచాయతీలో,17,18 తేదీలలో సోమవారం పంచాయతీలో, 20వ తేదీ పెదవీడు పంచాయతీలో, 21 తేదీల్లో సంఘం వాళ్ళ పల్లె పంచాయతీలో 24 తేదీలో మట్లి పంచాయతీలో, 26 తేదీలో తాటికుంటపల్లి పంచాయతీలో, 28 తేదీలో వీరబల్లి పంచాయతీలో 31 తేదీల్లో గుర్రప్ప గారి పల్లె పంచాయతీలో, జనవరి 3తేదీలో ఒది వీడుపంచాయతీలో,7 తేదీ సానే పాయి పంచాయతీలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించబడును ఆమె పేర్కొన్నారు. ఈ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## పారిశుద్ధ్యం పనులు తనిఖీ



పెండ్లిమర్రి, డిసెంబరు 4, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామ పంచాయతీలో బుధవారం పారిశుద్ధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కడ గాని పారిశుద్ధ్యం పనులు శుభ్రంగా ఉండేలా పనులు చేయించాలన్నారు అలాగే ఇటీవల కురిసిన వర్షానికి గ్రామ పంచాయతీలో పరిశుభ్రంగా ఉండాలన్నారు. రోడ్లు పైన చెత్తాచెదారం ఉండకూడదన్నారు ఎక్కడన్నా చెత్తాచెదారం ఉంటే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## కంటి చూపు చాలా విలువైనది

- ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి



కమలాపురం, డిసెంబరు 4, ప్రభాతవార్త:

కంటి చూపు చాలా విలువైనదని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామంలో పుష్పగిరి విట్రియో రెటినా ఇన్స్టిట్యూట్ (పీవీఆర్ఐ) కడప భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కంటి పరీక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరంలో కళ్లు ప్రధానమైన భాగమని కంటి చూపుతో ప్రపంచాన్ని చూడవచ్చని అలాంటి కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కళ్లు లేకపోతే ప్రపంచమే చీకటి అన్నారు. ఈ కార్యక్రమం పీవీఆర్ఐ సీనియర్ మేనేజ్మెంట్, ప్రాజెక్టు బృందం మరియు భారతి సిమెంటు సిబ్బంది కలిసి నివారించగల అంధత్వాన్ని ఎదుర్కోవడానికి మరియు దృష్టి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి తీసుకువచ్చింది. పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరాలు మరిన్ని ఏర్పాటు చేసి మరింత చేరుకోవాలన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 153 మందిని పరీక్షించారు. వీరిలో 83 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచితంగా కళ్లద్దాలు మందులు పంపిణీ చేయగా 24 మందికి కంటి శుక్లం, శస్త్ర చికిత్స నిమిత్తం కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యశిబిరానికి వచ్చిన అవ్వా తాతలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడుగుతూ దగ్గరుండి ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి వైద్య పరీక్షలు చేయించారు. దీంతో అవ్వా తాతలు ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుష్పగిరి కంటి వైద్య శిబిరం సిబ్బంది భారతి సిమెంటు పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో గేదె మృతి

కమలాపురం, డిసెంబరు 4, ప్రభాతవార్త:



కమలాపురం మండల పరిధిలోని జంగంపల్లి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పిడుగు పడి గేదె మృతి చెందింది. జంగంపల్లి గ్రామానికి చెందిన అనిమల రాఘవ రైతు తనకున్న గేదెలను ఉదయం మేతకు తీసుకెళ్లి మధ్యాహ్నం తోలుకొని వచ్చి ఇంటి సమీపంలో చెట్టు కింద కట్టేశాడు. అకాలంగా వచ్చిన వర్షంలో ఆ చెట్టుపై పిడుగు పడింది. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న గేదె మృతి చెందింది. ఉదయం 5 లీటర్లు సాయంత్రం 5 లీటర్లు పాలిస్తుందని గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని ఈ గేదె మృతితో యజమాని లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

### పలు కుటుంబాలను పరామర్శించిన ముక్కా రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లి మండలం ఎల్లాయిపల్లి శంకరాపురం, రైల్వే కోడూరు గ్రామాల్లో అకస్మాత్తుగా మృతి చెందిన పలువురి కుటుంబాలను బుధవారం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పరామర్శించి వారి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జ్యోతి లక్ష్మయ్య మరియు వెంకటయ్య, సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చి అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. కొందరు అనారోగ్యంతోనూ మరికొందరు అకస్మాత్తుగా మృతి చెందడం ఎంతో బాధాకరమని ఆయన తెలిపారు. ఈయన వెంట సుబ్బరాయుడు, సీపీఐ నాయకులు జ్యోతి, చిన్నయ్య, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బొమ్మవరం పంచాయతీ అభివృద్ధి మా ధ్యేయం

ఓబులవారిపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లి మండలంలోని బొమ్మవరం పంచాయతీ అభివృద్ధి మా ప్రధాన ధ్యేయమంటూ టీడీపీ యువ నాయకులు గడ్డం చానల్ రాజు అన్నారు. బుధవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి మరియు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ముక్కా సాయి వికాస్‌రెడ్డి సహాయ సహకారాలతో బొమ్మవరం గ్రామ పంచాయతీ దిన దినాభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నామన్నారు. అందుకు గాను కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించి అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన సూచించారు. ఏపీకి ముందు ముందు మంచి రోజులు వస్తున్నాయని ప్రధాని మోదీ సహకారంతో ఏపీలో ఎన్నో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు వెచ్చించి శ్రీకారం చుట్టారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పక్కా ఇళ్ల నిర్మాణాలపై చొరవ చూపండి

తంబళ్లపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో గత ప్రభుత్వ పాలనలో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాల నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన హౌసింగ్ ఏఈ సుజాతతో కలిసి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష జరిపారు. అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారుల నుంచి వస్తున్న సమస్యలు, వాటి పరిష్కారానికి సచివాలయ అధికారుల సహకారం తీసుకొని సహకరించాలన్నారు. గృహాలు త్వరగా నిర్మించుకుంటే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ సమీక్షలో ఏఈ సుజాతతో పాటు ఈఓఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులకు కూలీలు పెంచకపోతే చర్యలు

తంబళ్లపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:



మండలంలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయడానికి కూలీల సంఖ్య పెంచకపోతే క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవని ఏపీవో అంజనప్ప, ఈసీ రామన్నలు హెచ్చరించారు. బుధవారం ఎఫ్ఏలతో జరిగిన సమీక్షలో పంచాయతీల వారీగా కూలీల సంఖ్య, జరుగుతున్న పనులు, జరిగిన పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులలో పండ్ల తోటల పెంపకం, ట్రెంచీలు, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం పనులపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా సోంపిట్‌లు నిర్మాణాలపై శ్రద్ధ చూపాలన్నారు. వర్షం పడిన కారణంగా ఉపాధి పనులు జోరందుకోవాలని పనులపై కూలీలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి పనికి వచ్చేలా చూడాలని సూచించారు. ఈ సమీక్షలో టెక్నికల్ అసిస్టెంట్లు శేఖరమ్మ, శంకర, వెంకటరమణ, నాగార్జున, మండలంలోని క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేద్దాం

తంబళ్లపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో తెదేపా సభ్యత్వం ముమ్మరం చేసి విజయవంతం చేద్దామని రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్ర, పార్లమెంటు టీడీపీ బీసీ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్లు తెలిపారు. బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలు మండల ఎపార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి సూచనలతో మండలంలోని గోపిదిన్నె పంచాయతీలో తెదేపా సభ్యత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ వంద శాతం సభ్యత్వంతో రూ.5లక్షల బీమాతో పాటు సభ్యుల విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు భవిష్యత్తులో పార్టీ అండగా ఉంటుందన్నారు. తంబళ్లపల్లె మండలంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో తెదేపా సభ్యత్వం చేయడానికి సమిష్టిగా కృషి చేద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువనేత జగదీష్, భాస్కర్, శ్రీనివాసులు, జయరాంరెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు - తహసీల్దార్

తంబళ్లపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తమ సమస్యలు సదస్సులో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ హరిప్రసాద్ సూచించారు. 6న ఎద్దులవారిపల్లి, 7న కొటాల, 10న గోపిదిన్నె, 11న దిగువపాలెం, 12న గడుండ్లపల్లి, 13న కోసువారిపల్లి, 17న బాలిరెడ్డిగారిపల్లి, 18న తంబళ్లపల్లె, 19న చేలూరువాండ్లపల్లి, 20న ఎరసానిపల్లి, 24న పంచాలమర్రి, 26న గంగిరెడ్డిపల్లి, 27న కొట్లపల్లి, 28న రేణుమాకులపల్లి, 31న కన్నెమడుగు, జనవరి 2న మర్రిమాకులపల్లి, 3న కోటకొండ, 4న కుక్కరాజుపల్లి, 7న జుంజరపెంట పంచాయతీలలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నోడల్ అధికారిగా మదనపల్లి సబ్ కలెక్టర్ ప్రత్యేక అధికారిగా రిజిస్ట్రేషన్, ఫారెస్ట్, దేవాదాయశాఖ, వక్స్‌బోర్డు శాఖాధికారులు పాల్గొంటారని రైతులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు తెలిపారు.

## యువకుడు ఆత్మహత్య

సంబేపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:

మద్యం తాగొద్దని చెప్పడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం బాటవారిపల్లెకు చెందిన రాయదుర్గం రామానుజులును మద్యం తాగొద్దని తండ్రి, భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లినట్లు తెలిపారు. రోజూ ఉదయం కుటుంబ సభ్యులు వారి మామిడి తోట వద్దకు వెళ్లి వెతకగా అక్కడ చెట్టుకు వేలాడుతున్నట్లు కనిపించాడు. ఈ విషయం స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మర్యాదపూర్వక కలయిక..

జమ్మలమడుగు, డిసెంబరు 4, ప్రభాతవార్త:



ఏపీ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామాత్యులు సత్యకుమార్‌ను విజయవాడలోని ఆయన నివాసంలో బుధవారం అనంతపురం అర్బన్ మాజీ శాసనసభ్యులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై ముచ్చటించారు.

## సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన

బద్వేలు అర్బన్ డిసెంబర్ 04 ప్రభాతవార్త :

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై రైతులకు ప్రజలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బద్వేలు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యం.కుళ్ళయప్ప, టౌన్ ఏ ఈ చిన్నయ్య రూరల్ ఏఈ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ విద్యుత్ వినియోగదారులు ఇంటిపై సోలార్ బిగించుకోవడం వల్ల విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చు అని సూచించారు. కావున మండలంలోని ఆసక్తిగల ప్రజలు గురువారం ఉదయం 11 గంటలకు విద్యుత్ సబ్స్టేషన్ నందు అవగాహన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలిపారు.

## మిట్స్‌లో అశ్వ 2025

కురబలకోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త :

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అశ్వ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయస్థాయి టెక్నోకల్చర్ స్పోర్ట్స్ ఫెస్ట్ పోస్టర్‌ను, ప్రమోషనల్ రీల్‌ను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి ఆవిష్కరించారు. ప్రతి ఏడాది కళాశాల నిర్వహించే ఈ ఫెస్ట్‌లో విద్యార్థులకు వివిధ పోటీలను టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ విభాగాలలో నిర్వహిస్తామని 2025 ఫిబ్రవరి 21, 22తేదీల్లో ఈ పోటీలను నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ఇందులో జాతీయస్థాయిలో ఇంజనీరింగ్, డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. డిసెంబర్ 6నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది సినీ ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అలరిస్తారని, ఈ సారి కూడా సినీతారలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమి అధ్యక్షులు ద్వారకనాథ్ కళాశా అశ్వ 25 కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్ కమాల్‌బాషా, కోకన్వీనర్ ప్రదీప్‌కుమార్, స్టూడెంట్ కో ఆర్డినేటర్స్ జగన్‌మోహన్‌రెడ్డి, సుశాంత్, పవన్, వంశీధర్‌రెడ్డి, హారిక, హర్షితలు పాల్గొన్నారు.



# విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలి

కె.విపల్లి డిసెంబర్ 04 ప్రభాతవార్త :

ఆదివారాలు,పండుగ దినాల్లో అదనపు తరగతులు నిర్వహించడం సబబు కాదు. పిల్లలను, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేయరాదు. గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు పెద్దగా తేడా లేదనే విధంగా విద్యా శాఖ అధికారులు నిర్ణయాలు ఉంటున్నాయి. పాఠశాలలో పనివేళలో పెంపు, 10 శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదనే ఆంక్షలు, పదవ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల ప్రణాళిక, విద్యార్థుల వివరాలు అపార్ లో నమోదు,...ఇలా ప్రతి ఒక్క నిర్ణయము అసంబద్ధంగానే ఉంటున్నాయి. పై ఉత్తర్వులు పరిశీలించినప్పుడు ఉపాధ్యాయ సంఘ నాయకులతో గాని ఉపాధ్యాయుల అభిప్రాయాన్ని తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒంటెత్తు పోకడతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. అవి గ్రామీణ ప్రాంతాల్లో ఆచరణకు అసాధ్యంగా ఉన్నాయి. ముఖ్యంగా మండలాల్లో 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదని మండల విద్యాశాఖ అధికారులు అత్యవసర సందర్భాల్లో కూడా సెలవు మంజూరు చేయడం లేదు. అనారోగ్యం బారిన పడిన వారికి సైతం సెలవులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురి అవుతున్నారు. ఉన్నాయి కదా విద్యార్థుల అపార్ నమోదులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక అంటూ ఆదివారాలు, పండుగ దినాలు సైతం పని చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలనే డిమాండుతో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్ ) రాష్ట్రమంతా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించింది. మా విజ్ఞప్తిని పరిశీలించి విద్యాశాఖ నిర్ణయాలను పునః సమీక్షించాలని, ఒత్తిడి లేని వాతావరణంలో ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకై పాటుపడేలా అధికారుల నిర్ణయాలు ఉండాలని కోరుతున్నాము. సమీక్షించని పక్షంలో మా పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలియజేస్తూ కె.వి.పల్లి మండల విద్యాశాఖ అధికారి పి.రెడ్డి బాష వారికి వినతి పత్ర ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కోశాధికారి బి చంద్రశేఖర్ మండల అధ్యక్షులు వెంకటరమణ ప్రధాన కార్యదర్శి అనిరుద్రయ్య జిల్లా కౌన్సిలర్ మదన్ మోహన్ రెడ్డి వెంకటేశ్వర్లు అన్నయ్య హరి ప్రసాద్ తదితర మండల నాయకులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోండి

సిద్దవటం, డిసెంబరు 4, ప్రభాతవార్త:



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో చుట్టుపక్కల గృహాల వద్ద, మంచినీటి కుళాయిల వద్ద నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉండాలని మండలంలోని మాధవరం-1 ప్రైమరీ హెల్త్ సెంటర్ డా.శివకుమార్ పలు ఆరోగ్య సమస్యలపై వచ్చిన రోగులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ వర్షాలు దృష్టిలో ఉంచుకొని సీజన్ వ్యాధుల పట్ల గ్రామాల్లో అపరిశుభ్రత వల్ల అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచనలు, సలహాలు తెలిపారు.

## పిచ్చిమొక్కలతో అల్లుకుపోయిన రహదారి

సిద్దవటం, డిసెంబరు 4, ప్రభాతవార్త:



సిద్దవటం మండలం ఉప్పరపల్లి గ్రామం, హౌసింగ్ పక్కా గృహాల కాలనీలో పలు రహదారులు పిచ్చి మొక్కలతో అల్లుకుపోయినా ఏమాత్రం ప్రజా సమస్యలు పట్టించుకోలేదని ఆ ప్రాంత వాసులు బుధవారం తెలిపారు. విద్యార్థులకు, స్కూలుకు వెళ్లేందుకు రహదారి కూడా లేదని ఈ ప్రాంతంలో విష పురుగులు సంచరిస్తున్నాయని సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించాలని ఆప్రాంత వాసులు కోరారు. పిచ్చి మొక్కల తొలగింపుపై గ్రామ పంచాయతీ సెక్రటరీ మనోహర్‌ను వివరణ కోరగా వర్షం తగ్గిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన హౌసింగ్ పక్కా గృహాలు కాలనీలలో పిచ్చి మొక్కలు తొలగిస్తామని గ్రామంలో పలు ప్రాంతాల్లో ఉన్న పారిశుద్ధ్యాన్ని తొలగిస్తామని ఆయన తెలిపారు.

## గ్రామ సచివాలయంపై మాజీ ముఖ్యమంత్రి ఫొటో

సిద్దవటం, డిసెంబరు 4, ప్రభాతవార్త:



సిద్దవటం మండలం జ్యోతి గ్రామ సచివాలయం నేమ్ బోర్డులో మాజీ సీఎం చిత్రపటం కనబడుతున్నా పట్టీ పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల పలువురు మండిపడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 7 నెలలు కావస్తున్నా ఇంకా రాష్ట్రానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటూ జగన్ బొమ్మలు సచివాలయాలపై దర్శనం ఇవ్వడం పట్ల మండల అధికారులు ఏవిధంగా విధి నిర్వహణలో ఉన్నారో దీన్ని బట్టి అర్థమవుతోంది. ప్రతి రోజూ పంచాయతీ కార్యదర్శి మరియు సచివాలయ సిబ్బంది సచివాలయానికి పోతున్నప్పటికీ మాజీ సీఎం ఫొటో వారికి కనిపించట్లేదా అంటూ ప్రజలు వాపోతున్నారు. రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు కించపరిచే విధంగా రాష్ట్ర సీఎం జగన్ అంటూ సచివాలయంపై కనపడడం విడ్డూరంగా ఉందంటూ గ్రామ సచివాలయ సందర్శకులు మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మాజీ సీఎం ఫొటో తొలగించాల్సిందిగా ప్రజలు కోరారు. ఈ విషయమై జడ్పీసీఈవో ఓబులమ్మను వివరణ కోరగా ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని మరియు వెంటనే ఫొటో తొలగిస్తామని తెలిపారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన ప్రతాప్‌రెడ్డి

బద్వేలు అర్బన్, డిసెంబర్04 ప్రభాతవార్త :



మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిగూడెంలోని పార్టీ కార్యాలయంలో బద్వేలు మండల పరిధి, వీరపల్లె గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ యువనాయకులు బూత్ ప్రెసిడెంట్ అక్కి ప్రతాప్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం బద్వేలులో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే పలు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే వైసీపీ పార్టీ బలోపేతానికి తమవంతు కృషిచేస్తామన్నారు.వైసీపీ పరిపాలనలో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని, అయితే కూటమి పాలన ప్రారంభమై 5 నెలలు కావస్తున్నా ప్రజలలోనైరాశ్యం తప్ప ఆనందంగా లేరన్నారు.

## రైతులు భీమా తప్పనిసరిగా చేసుకోవాలి

ములకలచెరువు, డిసెంబర్ 4 ప్రభాతవార్త :

మండలంలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట భీమా చేసుకోవాలని మొలకలచెరువు మండ వ్యవసాయ అధికారిణి లీలాకుమారి తెలిపారు. బుధవారం ములకలచెరువు మండలం చౌడసముద్రం గ్రామం, ములకలచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసిన ఉలవపంటను పరిశీలించారు. ఉలవ పంటను సాగుచేసిన రైతులకు తగు సలహాలు, సూచనలను అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంట వర్షాలు పడకపోవడంతో రైతులు వేసుకొన్న వేరుశెనగ పంట ఆశించిన మేరకు ఫలితాలు ఇవ్వలేదన్నారు. దీంతో రైతులు నిరాశచెందారన్నారు.అయితే ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటగా సాగుచేసుకునేందుకు రైతులకు నాణ్యమైన ఉలవలను సబ్సిడీతో ప్రభుత్వం అందజేసినట్లు తెఇపారు. ఎకరాకు 4క్వింటాల్ రాబడి రైతులు గడుస్తుండడంతో లాభాలు పొందుతున్నట్లు తెలిపారు. మండలంలో డిసెంబర్ 31వ తేదీ వరకు పొలం పిలుస్తొంది. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి లీలాకుమారితో పాటు చౌడసముద్రం గ్రామ పంచాయితీ సర్పంచ్ రాంబాబునాయుడు, రైతులు, వ్యవసాయ సహాయకులు అంజినేయులు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.




పొలం పిలుస్తొందిలో అధికారులు

## తహశీల్దార్ అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలి

కార్మిక సంఘం, ఏఐటియుసి నాయకులు ధర్నా

మదనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :




ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె తహశీల్దార్ ఖాజాబీపై వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలని రాష్ట్ర వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణప్ప, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. బుధవారం వారు తహశీల్దార్ కార్యాలయం వద్ద సంఘం నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం చేయాలని సమస్యను బట్టి లంచాలు అడుగుతున్న తహశీల్దార్‌పై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డికి సంబంధించిన మూటేషన్‌కు రూ.లక్ష లంచం అడిగిందని వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలన్నారు. తహశీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూరల్ మండలంలో పలు భూ సమస్యలకు సంబంధించి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం భూములు అన్యాక్రాంతం అవుతున్నా రియల్టర్లకు తహశీల్దార్ వత్తాసు పలుకుతున్నారన్నారు. పేదల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, తిరుమల, మురళి, మణి, కాటయ్య, నీలావతి, నిర్మల, గోపాల్, మల్లికార్జున, వెంకటేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 6నుంచి రెవెన్యూ సదస్సులు

రామసముద్రం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :



మండలంలో ఈనెల 6నుంచి జనవరి 8వ తేది వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నిర్మలాదేవి తెలిపారు. బుధవారం తన కార్యాయంలో తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయితీల్లో సదస్సులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ప్రజలు తమ మస్యలను వినతిరూపంలో తెలపవచ్చనని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

రామసముద్రం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :



గంగమ్మను దర్శించుకొన్న మాజీ ఎమ్మెల్యే

మండలంలోని కాప్పల్లి హరిజనవాడలో నూతనంగా నిర్మించిన శ్రీకుంటి గంగమ్మ ఆలయాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు, గ్రామస్థులు తిప్పారెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ పూజాకార్యక్రమంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చనతో పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ ఆలయానికి స్థానిక సుబ్రమణ్యంరాజు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మనపల్లె రామారావు,దినకర్, రాజేష్, హైదర్‌సాబ్, ఈశ్వర్,అబ్బరాజు చెంగప్ప, రెడ్డప్ప, ఎంపిటిసి విజయరారెడ్డి, గణేష్, జింకల శ్రీనివాసు, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

## ములకలచెరువు ఎస్ఐగా నరసింహులు

ములకలచెరువు, డిసెంబర్ 4 ప్రభాతవార్త :



ములకలచెరువు ఎస్ఐగా బుధవారం నరసింహులు ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేస్తున్న గాయత్రి మదనపల్లె రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో పిటిఎం ఎస్ఐగా పనిచేస్తున్న నరసింహులను జిల్లా ఎస్పి విద్యాసాగర్‌నాయుడు నియమించారు. ఉద్యోగ బాధ్యతలను స్వీకరించి అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాలో ఎక్కడైనా అసాంఘీక కార్యక్రమాలు జరిగితే తనకు సమాచారం అందజేయాని తెలిపారు.

## రాజంపేట పాలిటెక్నిక్ కళాశాలలో రేపు పాలిటెక్ ఫెస్ట్

రాజంపేట అర్బన్, డిసెంబర్ 04, ప్రభాతవార్త:

రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం కడప రీజనల్ పాలిటెక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం మేకింగ్ ఇండియా నినాదంతో యువతలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రపంచ స్థాయి ఆవిష్కరణలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో సదస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాజంపేటలో రాజంపేట పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేయనున్న పాలిటెక్ ఫెస్ట్‌కు 32ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. 140 ఆవిష్కరణలను ఈ ఫెస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శిస్తారని తెలిపారు. 6, 7తేదీల్లో జరిగే ఈ సదస్సును జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ప్రథమ విజేతకు 25వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 10వేల రూపాయలు, పురస్కారం అందిస్తామని తెలిపారు. ఈ ఫెస్ట్‌కు 9,10వ తరగతి విద్యార్థులు హాజరై తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

## 6 నుంచి రెవెన్యూ సదస్సులు

దువ్వూరు, డిసెంబర్ 04, ప్రభాతవార్త:

దువ్వూరు మండలంలోని 23గ్రామ పంచాయతీలో 6వ తేది నుండి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇక్బాల్ బాష తెలిపారు. ఈ సదస్సుల్లో రైతులకు సంబంధించిన భూములు ఆన్‌లైన్ కాకపోవడం ఇతరత్రా ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. 6వ తేదిన పలకువారి పల్లె, 7న పెద్దజొన్నవరం, 9న ఇడమడక, 10న జిల్లెల్ల, 11న మదిరేపల్లి, 12న నీలాపురం, 13న దాసరిపల్లె, 16న నేలటూరు, 17న మాసనపల్లె, 18న ఎం.యర్రబల్లె, 19వ తేదిన దువ్వూరు-1, 20న దువ్వూరు-2 సచివాలాయాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులు జనవరి 8వ తేది వరకు ఉంటాయని రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

## విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం



ప్రొద్దుటూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త:
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలల కాలంలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తూ విద్యా విధానాలను అటకెక్కించి నిరక్షరాస్యతను పెంచేలా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు బుధవారం వైసీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు నెలల చంద్రబాబు పాలనలో జగన్ ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన నూతన విద్యా విధానాన్ని అమలు పరిచిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు మరోసారి మోసం చేసే వైనాన్ని చూస్తున్నామని విమర్శించారు. తల్లికి వందనం పేరుతో చంద్రబాబు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి పథకం వర్తింప చేస్తామని హామీ ఇచ్చి కనీసం ఒక్కరికైనా తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారా అని ప్రశ్నించారు. అలాగే బియ్యం అక్రమ రవాణా ఇప్పటినుండి జరిగేది కాదని గత తెలుగుదేశం ప్రభుత్వంలో కూడా జరిగిన మాట వాస్తవం అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, గుర్రం లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి, వైసిపి నాయకులు డీలర్ ఆంజనేయులు పోసా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ క్రాఫ్ బుకింగ్ చేసుకోవాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్




గాలివీడు, డిసెంబర్ 4(ప్రభాతవార్త):
రైతులందరూ వారు సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాప్ట్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పందికుంట పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతిర ఐతు రబీ సీజన్లో సాగు చేసిన ప్రతి పంటకూ ఈ క్రాఫ్ట్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. రైతులందరూ వేరుశనగ, టమోటా పంటలకు క్రాఫ్ ఇన్సూరెన్స్ డిసెంబర్ 15లోగా వరి పంటకు డిసెంబర్ 30లోగా క్రాఫ్ ఇఊ్సరెన్స్ చేయించుకోవాలని తెలియజేశారు. వేరుశనగ సాగు రైతులు వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలతో పాటు మెలకువలు పాటించినట్లయితే అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. ప్రస్తుత నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలు చేస్తున్నటువంటి రైతులు కొద్ది రోజులు నిలుపుదల చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఆఫీస్ టెక్నికల్ ఏఓ వెంకటమోహన్, లక్కిరెడ్డిపల్లె సమాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయాదికారిణి గౌతమి, ఏఈఓ అపర్ణ పందికుంట రైతులు పాల్గొన్నారు.

## శబరియాత్రకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు



గాలివీడు, డిసెంబర్ 4(ప్రభాతవార్త):
మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని అయ్యప్ప భక్తులు శబరియాత్రకు బయలుదేరి వెళ్లారు. బుధవారం గురు స్వామి వెంకటేష్ ఆధ్వర్యంలో 25 మంది అయ్యప ్ప భక్తులు ఇరుముడిలు కట్టుకొని శబరి గిరీశుని దర్శనానికి తరలివెళ్లారు. గ్రామస్తులు మూకుమ్మడిగా గ్రామం వెలుపలి వరకు వచ్చి అయ్యప్పలకు వీడ్కోలు పలికారు.

## వర్షాలకు దెబ్బతిన్న కాజ్వేల్‌ను నిర్మించండి

సుండుపల్లి, డిసెంబర్ 4, ప్రభాతవార్త:



తుఫాన్ వలన దెబ్బతిన్న కాసులను తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రజలకు రాకపోకలు కు ఇబ్బంది లేకుండా చూడాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ గిరిజన విభాగం ఉపాధ్యక్షుడు ఆనంద నాయక్ అన్నారు బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న తుఫాను వర్షాలకు పించా ప్రాజెక్టు నిండి పోవడంతో, ప్రాజెక్టుపైన వరద నీరు ఎక్కువగా ప్రవహించడం వలన దిగువనున్న ప్రాజెక్టు గేట్లు ఎత్తడం జరిగినదిని, ఆ ప్రభావం వలన దాదాపు 1274క్యూసెక్కులు నీరు వదలడం జరిగినదని దాని ప్రభావం వలన రాయవరం నుండి రెడ్డివారిపల్లి తాత్కాలిక కాజ్వే పూర్తిగా కొట్టుకు పోయినందువలన పాఠశాలకు వెళ్లే బస్సులు రాకపోకలు స్తంభించడంతో విద్యార్థులు, ప్రజలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. ప్రజలు పిల్లలు స్కూల్‌కు రావలన్న, ప్రజలు సుండుపల్లికి రావాలన్న ఎటువంటి అవకాశం లేదని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నబిడికి రాచపల్లి లోవల్ బ్రిడ్జి పాక్షికంగా దెబ్బ తినడంతో రాకపోకలు లేవు ప్రజలకు తీవ్రంగా ఇబ్బందులకు గురి అవుతున్నారు స్కూలు పిల్లలకు స్కూళ్లకు పంపించాలన్న మండల కేంద్రానికి ఏదైనా అవసరపడి వెళ్లాలన్నా ఎటువంటి మార్గం లేదన్నారు. ఈ కాజ్వేలకు వెంటనే మరమ్మత్తులు చేయించి రోడ్డు సౌకర్యం కల్పించేయాల్సిందిగా ఆయన నాయకులకు విజ్ఞప్తి చేశారు.

## లయన్స్‌క్లబ్‌ఆఫ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

రాయచోటి డిసెంబర్ 4 ప్రభాతవార్త



నిన్న రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలో బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, వీరభద్రస్వామి ఆలయము, శ్రీ షిరిడి సాయి మందిరము, రోడ్లపైన నిద్రిస్తున్న యాచకులకు దుప్పట్లను లయన్ కూన విజయ్ కుమార్ ఆర్థిక సహాయముతో పంపిణీ చేయడం జరిగిందని అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న రాయచోటి పట్టణ ఎస్పై అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేస్తున్నారని ఈ రోజు కూడా చాలా తీవ్రత ఎక్కువ ఉన్నందున వాళ్ళ వంతుగా రాయచోటి చుట్టుపక్కల నిద్రిస్తున్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం దాత లయన్ కూన విజయ్ కుమార్ మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో చాలి తీవ్రత ఎక్కువ ఉన్నందున నా వంతుగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈ రోజు రాయచోటి చుట్టు పక్కల రోడ్ల పైన నిద్రిస్తున్న యాచకులకు నా వంతుగా దుప్పట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ఎం.టీ కో ఆర్డినేటర్ లయన్ పి.యస్.హరినాథ్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర, కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, లయన్ ప్రసాద్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## కడప స్టీల్ ప్లాంట్ పై మోసం చేసిన మోదీ ప్రభుత్వం



వేంపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త :
కడప స్టీల్ ప్లాంట్‌పై మోదీ ప్రభుత్వం మోసం చేసిందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎం.తులసి రెడ్డి అన్నారు. వేంపల్లి లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కడప స్టీల్ ప్లాంట్ అంశం ప్రస్తుతానికి మా ముందు లేదని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి మంగళవారం లోక్‌సభలో చెప్పడం దురదృష్టకరం అన్నారు. రాయలసీమలో, ప్రత్యేకించి కడప జిల్లాలో నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర విభజన చట్టంలో 13 వ షెడ్యూల్‌లో కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మించాలని పేర్కొనడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చివుంటే ఈ పాటికి జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మించబడి వుండేదన్నారు. ఉక్కు కర్మాగారం నిర్మాణానికి కావలసిన భూమి, నీరు, విద్యుత్ శక్తి, రవాణా సౌకర్యాలు, మడిసరుకు సున్నపురాయి, డోలమైట్ అన్నీ వున్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి, రాష్ట్రంలోని టిడిపి, వైకాపా పార్టీలకు చిత్తశుద్ధి లేని కారణంగా 10 సంవత్సరాలు దాటినా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా వున్నప్పుడు ఒకసారి, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక సారి, జగన్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు 2 సార్లు శంఖుస్థాపన చేశారన్నారు. అయినా ముందుకు సాగలేదని ఆయన తెలిపారు.

## 6నుంచి జనవరి 8వరకు సదస్సులు

లక్కిరెడ్డిపల్లె : డిసెంబర్ 04 ప్రభాతవార్త
డిశంబరు 6 నుంచి జనవరి 8 వరకు గ్రామాలల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాశిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. 6వ తేదిన దప్పేపల్లె సచివాలయం, 10 బి ఎర్రగుడి, 13 దిన్నెపాడు , 17న లక్కిరెడ్డిపల్లె, 20న కుర్నూతల, 23న పందిళ్లపల్లె 26న గుడ్లవారిపల్లె, 28న అనంతపురం, 31న నరసింహ రాజుగారిపల్లి , జనవరి 2న సోమలవాండ్లపల్లి , 4న మద్దిరేవుల , 8న కాకుళవరం, గ్రామాలల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని మౌలిక సదుపాయాలతో పాటు భూసమస్యలు పరిష్కరించుకోవచ్చున్నారు. రైతులు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆలయ స్థలాన్ని రీసర్వే చేయించండి



వేంపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త :
వేంపల్లి పట్టణంలోని వృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాన్ని రీ సర్వే చేయించాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ అన్నారు. బుధవారము వేంపల్లి కి వచ్చిన జిల్లా దేవదాయ శాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్‌ను ఆయన కలిశారు. దేవస్థానానికి సంబంధించిన సర్వే నంబర్ 416 లోఉన్న 70 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో నాయీ బ్రాహ్మణులను నియమించి స్వామి వారి పూజా కార్యక్రమాలలో ఉండేటట్లు చూడాలని కోరారు. అలాగే ఎద్దులకొండ పై అసంపూర్తి గా నిలిచి పోయిన ప్రహరీ గోడ, డ్రైనేజి, రాజగోపురం వంటి పనులు పూర్తి చేయించాలని కోరారు. ఇందుకు జిల్లా దేవదాయ శాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ ఇక్కడ ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సొక్కం మల్లికార్జున, దేవస్థాన ఈఓ విశ్వనాథ రెడ్డి, దాసి రెడ్డి, సుధాకర్ రంగప్రసాద్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో 7వ తరగతి విద్యార్థి మృతి



వాల్మీకిపురం, డిసెంబర్ 04 ప్రభాతవార్త::
అనారోగ్యంతో 7వ తరగతి విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం వాల్మీకిపురం పట్టణం ఫింగాణి ఫ్యాక్టరీ వద్ద చోటు చేసుకొంది. వివరాలు.. ఫింగాణి ఫ్యాక్టరీ ప్రాంతంలో నివాసం ఉంటున్న శేఖర్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు ప్రభావ్ (12) స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డకు తల్లిదండ్రులు చికిత్సలు చేయించారు. మంగళవారం రాత్రి ప్రభావ్‌కు తలనొప్పి తీవ్రం కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మార్గమధ్యంలో ప్రభావ్ మృతి చెందాడు. బుధవారం ఉదయం ప్రభావ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానిక పివిసి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు ప్రభావ్ మృతదేహాన్ని సందర్శించి, తల్లిదండ్రులకు ధ్యైర్యం చెప్పారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

వాల్మీకిపురం, డిసెంబర్ 04 ప్రభాతవార్త:
ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణ శివారు ప్రాంతంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు మండలంలోని కూరపర్తికి చెందిన సదాశివ రెడ్డి (53) మదనపల్లిలో నివాసముంటున్నట్లు తెలిపారు. సొంత పనుల నిమిత్తం మంగళవారం సదాశివరెడ్డి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వచ్చి పనులు ముగించుకొని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలోని పట్టణ శివారు ప్రాంతం సమీపంలోని సబ్ క్జెల్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సదాశివరెడ్డిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకొని మృతిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ధ్యైర్యం చెప్పారు. అలాగే పోస్టుమార్టం త్వరితగతిన పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

## రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలి



చిట్వేలి, డిసెంబర్ 4, ప్రభాతవార్త:
ప్రజల భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను అవసరమైన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని మండల తహసిల్దార్ మోహనకృష్ణ తెలియపరిచారు. బుధవారం తాను మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబర్ 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు ఈ సదస్సులను ప్రతి గ్రామంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ రెవెన్యూ సమస్యలకు సత్వరమే పరిష్కారం పొందాలని ఎమ్మార్వో మోహన్ కృష్ణ తెలియపరిచారు.

## ఎమ్మెల్సీ చొరవతో షోకాజ్ నోటీసులు రద్దు

పులివెందుల, డిసెంబరు 4, ప్రభాతవార్త :
పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చొరవతో 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు రద్దయ్యాయి. ఆపార్ నమోదులో నిర్లక్ష్యంగా వున్నారని కడప జిల్లాలో 829 మంది ప్రధానోపాధ్యాయులకు కడప జిల్లా విద్యాశాఖ ఇన్ చార్జి అధికారి మీనాక్షి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళారు. అపార్ నమోదులో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఆయన మంత్రికి వివరించారు. ఇందుకు మంత్రి నారా లోకేష్ స్పందించి నోటీసులు ఇవ్వవద్దని తెలిపారు. కమీషనరు విజయరామరాజుతో ఎమ్మెల్సీ మాట్లాడారు. అలాగే కడపకు వెళ్లి జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి మీనాక్షితో చర్చించారు. ప్రధానోపాధ్యాయులకు నోటీసులు ఇవ్వవద్దని, ఆపార్ నమోదులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. షోకాజ్ నోటీసులు రద్దు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

## పులివెందుల అర్బన్ సీఐగా బాధ్యతలు



పులివెందుల రూరల్, డిసెంబరు 4, ప్రభాతవార్త :
పులివెందుల అర్బన్ సీఐగా టి.నరసింహులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ సీఐగా పనిచేసిన జీవన్ గంగానాథ్ బాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నరసింహులు బాధ్యతలు చేపట్టారు.

## నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

లక్కిరెడ్డిపల్లి : డిసెంబర్ 04 ప్రభాతవార్త




నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎంపిడిఓ రెడ్డెయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ సభాభవనంలో నీటి సంఘం ఎన్నికల గురించి గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయ కట్టు కింద భూములు ఉన్న రైతులను 6 నియోజక వర్గాలు చేసి నీటి వినియోగదారుని సంఘం కింద చేర్చి వారి ఏకా అభిప్రాయాల ద్వారా నీటి సం ఘం ప్రసిడెంట్ వైఎస్ ప్రసిడెంట్ను ఎన్నుకోవాలన్నారు. లేదంటే సభ్యులందు చేతులెత్తి సభ్యుని ఎన్నుకోవచ్చున్నారు. నీటి సంఘం ప్రసిడెంటు ఎన్నికలో భాగంగా అందుకు సంబందించిన డైరక్టర్లును కూడా ఎన్నుకోవాలని తెలియజేశారు. నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరపాలని ఏదైన సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తాశిల్దార్ శ్రీనివాసులు. ఎంఈఓ 2 వెంకటసుబ్బయ్య, మండల ఇరిగేషన్ ఆఫీసర్ మహాభూబాభాష, అగ్రికల్చర్ ఏఓ రమేష్ బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనాధ మహిళకు అంత్యక్రియలు

ప్రొద్దుటూరుఅర్బన్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :
గవర్నమెంట్ హాస్పిటల్ లో చౌదూర్ రాజమ్మ (55) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించగా అంత్యక్రియలు నిర్వహించడానికి బంధువులు రాకపోవడంతో అంత్యక్రియలు చేయడానికి ఫోన్ ద్వారా మేఐహెల్ప్యూ ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుభాహన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి బుధవారం హిందు స్మశాన వాటికలో సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుభహాన్, జమ్మలమడుగు టౌన్ ప్రెసిడెంట్ అహమద్ హుస్సేన్, కృపా అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు, సుమన్ బాబు, శ్రీరామ్, రమేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రామపురం డిసెంబర్ 4 ప్రభాతవార్త
పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు గొర్రెల పెంపక దారులు అప్రమత్తంగా ఉండాలని బుధవారం పశువర్ధక శాఖ ఉపసంచాలకులు డి మాలకొండయ్య రైతులకు సూచనలు చేశారు మండలంలోని సరస్వతి పల్లి పంచాయతీ రాచపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు ఈ సందర్భంగా సరస్వతి పల్లి దళితవాడలో ఇటీవల మృతి చెందిన ఒంగోలు జాతి ఆవుల దూడల యజమానులతో ఆయన మాట్లాడుతూసీజన్ వ్యాధుల పట్ల పశువుల యజమానులు గొర్రెల పెంపకం దారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు ఈ సీజన్లో గొర్రెలకు ఎక్కువగా పిల్లి సరక(శిశిళి) (పేస్టేడేస్ పెటీట్స్ రుమినెంట్స్ )అవకాశం ఉంటుందని ప్రభుత్వం పశు ఆసుపత్రులలో ఉచితంగా వేసే టీకాలు తప్పకుండా గొర్రెలకు వేయించుకోవాలని సూచించారు ఆయన వెంట మండల పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి పశువర్ధక శాఖ సిబ్బంది పాడి రైతులు గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామాపురం : డిసెంబర్ 04 ప్రభాత వార్త
రాయచోటి లక్కిరెడ్డిపల్లి రహదారిలో గత నెలలో టీవీఎస్‌లో పోతుండగా కుమ్మరపల్లి సమీపంలోని ఉయ్యాలకుంట దగ్గర రెండు స్కూటర్లు ఢీకొన్న ఘటనలో మహబూబ్ బాషా అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి గాయపడిన వ్యక్తిని కడప రిమ్స్ కు తరలించారు అక్కడ మెరుగైన చికిత్స కై తిరుపతి రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ రెడ్డి తెలిపారు.

## 6 నుండి రెవిన్యూ సదస్సులు

రామాపురం : డిశంబర్ 04 ప్రభాత వార్త
రామాపురం మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో డిసెంబర్ 6 నుండి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ రామాంజనేయులు తెలిపారు శుక్రవారం 6 వ తేదీ గోపిగుడిపల్లి 10తేదీ రాచపల్లి 13 నల్లగుట్టపల్లి 17 గువ్వల చెరువు సరస్వతి పల్లె 21 పొత్తకూరు పల్లె 24 కల్పనాల చెరువు 27 నీలకంఠరావుపేట2025 జనవరి 2 వ తేదీ బండపల్లి 4 తేదీ హసనాపురం 7తేదీ సుద్దమల్ల 8వ తేదీ చిట్లూరు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## కొండ చరియలను తొలగించిన టిడిపి నాయకుడు



చిట్వేలి, డిసెంబర్ 4, ప్రభాతవార్త:
రాపూరు ఘాట్ రోడ్ లో తుఫాను కారణంగా మంగళవారం రాత్రి కొండ చరియలు విరిగిపడి వాహనదారులకు ఇబ్బంది కలిగిన విషయం అందరికీ విదితమే. ఆర్ అండ్ బి అధికారులు స్పందించలేదని ప్రభాతవార్త ద్వారా విషయాన్ని వినిపించడం జరిగింది. స్థానిక కూటమి నాయకులు, అధికారులు తొలగించే చర్యలు చేపట్టలేదు. సామాజిక మాధ్యమం ద్వారా విషయం తెలుసుకున్న రాజంపేట టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు టీమ్ సభ్యులు చొరవ చూపి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లు, రాళ్లు, మట్టిని జెసిబి యంత్రంతో తొలగించడం జరిగింది. అందరికీ ఉపయోగకరమైన పనిని చేపట్టిన వారికి మండల ప్రజలతో పాటు వాహన చోదకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రెవెన్యూ సదస్సులు ప్రారంభం

పుల్లంపేట :డిసెంబర్ 4 , ప్రభాతవార్త :
పుల్లంపేట మండలంలో రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పుల్లంపేట తాసిల్దార్ ఒక ప్రకటన విడుదల చేశారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే ఈ సదస్సులుజనవరి 7వ తేదీతో ముగియనున్నాయని ఆయన ఆ ప్రకటనలో వివరించారు. మండలంలో రైతులందరూ ఈ సదస్సులో పాల్గొని వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుంటుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సదస్సులు ఆయా గ్రామ పంచాయతీలోని సచివాలయాల్లో కానీ గ్రామపంచాయతీ కార్యాలయంలో గాని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ రెవెన్యూ సదస్సులు ఉంటాయని ఆ సమయంలో మండలంలోని రైతులందరూ హాజరై వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలు కలగజేసుకోవాలని ఆయన కోరారు. దలవాయిపల్లె గ్రామానికి సంబంధించి శుక్రవారం. కేతరాజుపల్లె శనివారం, సోమవారం పుల్లంపేట సచివాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు

## నిజమైన రైతులకు ఓటు హక్కు లేదు

పుల్లంపేట, డిసెంబర్ 04, ప్రభాతవార్త:



ప్రస్తుతం జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికల్లో నిజమైన రైతులకు ఓటు హక్కు లేదని వాత్తలూరు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మురిశంకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009, 2015 నీటి సంఘాల ఎన్నికల్లో ఓటర్ లిస్ట్ ఉన్న రైతుల పేర్లే 2024లో లిస్టులో కూడా అదే పేర్లు ఉన్నాయని ఆయన వివరించారు. చాలామంది రైతులు చనిపోయిన వారు మూల అమ్ముకున్న వారు ఉన్నందున నిజమైన రైతులు ఓటు హక్కును వినియోగించుకోలేరని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. 15 సంవత్సరాలు క్రితం పేర్లు ప్రస్తుత హోటల్ జాబితాలో ఉన్నాయని ఆయన భూముల అమ్ముకున్న రైతుల పేర్లు ఉన్నాయని ఈ విషయాన్ని అధికారులు గమనించి అసలు సిసలైన భూముల ఉన్న రైతుల పేర్లను లిస్టులో ఉండేటట్లు చూడాలని ఆయన కోరారు.

## కడప ఉక్కు పైన కేంద్ర వైఖరి దారుణం

బద్వేల్ అర్బన్ డిసెంబర్ 04 ప్రభాతవార్త



పార్లమెంటు సమావేశాలలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కడప ఉక్కు సమస్య మా దగ్గర లేదని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అనడం కడప ఉక్కుపైన వివక్షత స్పష్టంగా కనపడుతుంది దీనిని డివైఎఫ్ఐ యువజన సంఘంగా ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. బద్వేల్ లోని స్థానిక సుందరయ్య భవనం కార్యాలయం ఆవరణలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదటి నుండి కడప ఉక్కు పైన వివక్షత చూపుతూ వస్తూనే వున్నదన్నారు. విభజన హామీ చట్టబద్ధంగా కడప ఉక్కును నిర్మించాలని అనుకున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఒక్క అడుగు కూడా కడప ఉక్కుకు ముందుకు సాగలేదన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్.కె ఆదిల్ రూలర్ కార్యదర్శి బాలగురయ్యా పాల్గొన్నారు.

## కోదండరామునికి పూజలు చేసిన సుగవాసి

ఒంటిమిట్ట, డిసెంబర్ 4 ప్రభాతవార్త:



చెర్లోపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో రాజంపేట టిడిపి ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యంల ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెర్లోపల్లిలో నూతనంగ ఆలయం బుధవారానికి ప్రారంభించి 41 రోజులు కావడంతో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ ప్రజలు ఘనగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో ప్రజల కోసం ఎంతవరకైనా పోరాడుతాయని తెలిపారు. ఈ కార్య క్రమంలో మండల పార్టీ ఆద్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు, పార్టీ సీనియర్‌నాయకుడు క్లాస్1 కంట్రాక్టర్ రమణ, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, మాదవరెడ్డి, హరిరెడ్డి, మనోజ్‌రెడ్డి, తులసి రెడ్డి, అభిషేక్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శేషారెడ్డి, చెన్నారెడ్డి, శ్రావణ్‌రెడ్డి, మండల ఉపాద్యాక్షుడు మౌలాలి, చామా వెంకటసుబ్బారెడ్డి, నామాల వెంకటయ్య, వీరాంజనేయరెడ్డి, సాదు శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, మలేష్‌యాదవ్, పిచ్చయ్యాయాదవ్, రాజారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, బాలకృష్ణ, పత్తి సుబ్బరాయుడు, అయ్యావారయ్య, చంద్రా, ఎస్వీ రమణ, జైసింహారెడ్డి, రమణ నరసింహులు, లక్ష్మిరెడ్డి, చం ద్రపాలెం చిన్నరి, మదు, ప్రసాద్, నరసింహానాయుడు, శంకర్‌దాదా, రాజారెడ్డి, సురేష్, వెంకటసుబ్బయ్య, శివ, రోశయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట సిఐగా బాబు

ఒంటిమిట్ట డిసెంబర్4 ప్రభాతవార్త:
ఒంటిమిట్ట సిఐగాటి. బాబు బాద్యతలు స్వీకరించారు. బుధవారం ఆయన స్దానిక సిఐ కార్యలయంలో ఆయన బాద్యతలు స్వీకరించారు. ముందుగా ఇక్కడ సిఐగా పని చేస్తున్న కృష్ణంరాజు నాయక్ కడప విఆర్‌కు బదిలీ ఆయ్యారు. అన్నమయ్యజిల్లాలో పనిచేస్తున్న బాబు ఒంటిమిట్టకు సిఐగా బదిలీపై వచ్చారు.

## భూ సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్



రాయచోటి, డిసెంబర్ 4 ప్రభాతవార్త
భూ సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

## వేంపల్లె వాసికి ఇంగ్లీష్‌లో డాక్టరేట్



వేంపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త :
వేంపల్లె పట్టణానికి చెందిన షేక్ గౌసాకు ఇంగ్లీషు సబ్జెక్టులో జవహర్ లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ, అనంతపురం పిహెచ్‌డి. పట్టాను ప్రదానం చేసింది. కర్నూలుకు చెందిన డిఆర్‌కె. వి. సుబ్బారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. సి.హెచ్. బి. జాకబ్, జె.ఎన్.టి.యూ యూనివర్సిటీ ప్రొఫెసర్ చిత్రల పర్యవేక్షణలో షేక్ గౌసా "యాన్ ఎంపీరికల్ స్టడీ ఆన్ ది అడాప్షన్ ఆఫ్ వెబ్ బేస్డ్ టీచింగ్ ఇన్ ది సెలెక్ట్ డిగ్రీ కాలేజెస్ ఆఫ్ వై.ఎస్.ఆర్ అన్నమయ్య డిస్ట్రిక్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ " అను అంశంపై పరిశోధన చేసినందుకు జేఎన్టీయూ యూనివర్సిటీ, అనంతపురం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

## ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలి



కడప కలెక్టరేట్ డిసెంబర్ 03 ప్రభాత వార్త
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని అమరావతికి తరలింపు ఆపాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డి.ఎం.ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం అన్ని విధాలుగా వెనకబడి ఉందని ఈ తరుణంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలో ఉండటం ఇటు ప్రత్యక్షంగాను ఆటు పరోక్షంగా ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. వ్యాపారం, టెక్నాలజీ, ఆర్బీఐ అనుమతించిన చెస్ట్ సౌకర్యం, సొంత భవనాలు, ప్రజా భవనాలు విలీనం అవుతున్న సప్తగిరి, చైతన్య గోదావరి, ఏపీ వికాస్ బ్యాంక్ కంటే మిన్నగా కడపలోని ఏపీజీబీకే ఉన్నాయన్నారు. కాబట్టి ఈ ప్రాంత ప్రజల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం విలీనం తర్వాత ఏర్పడబోయే రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడప లోనే కొనసాగించాలని, అమరావతికి తరలించ వద్దని ఆయన డిమాండ్ చేశారు.

# విద్యాశాఖ అధికారులు తమ అనాలోచిత నిర్ణయాలను రద్దు చేసుకోవాలి



**పీలేరు డిసెంబర్ 04 ప్రభాతవార్త ః**

హేతుబద్ధం కాని అదనపు తరగతుల కాలనిర్ణయ పట్టిక విషయంలో విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న తమ అనాలోచిత నిర్ణయాలను రద్దు చేసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సదాశివరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు మధ్య పెద్దగా వ్యత్యాసం లేదన్నట్లుగా విద్యాశాఖ అధికారుల నిర్ణయాలు ఉంటున్నాయని విమర్శించారు. పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదన్న ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల ప్రణాళిక, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు, ఇలా ప్రతి ఒక్క నిర్ణయం అసంబద్ధంగానే ఉంటున్నాయన్నారు. ఇలాంటి ఉత్తర్వులు పరిశీలించే ముందు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను తీసుకున్న దాఖలాలు లేవని చెప్పారు. ఉన్నతాధికారులు ఏకపక్షంగా ఈ విధమైన నిర్ణయాలు తీసుకోవడం తగదని హితవు పలికారు. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో ఆచరణ అసాధ్యమా అని ప్రశ్నించారు. ముఖ్యంగా మండలాల్లో ఉపాధ్యాయులు 10 శాతానికి మించి సెలవు పెట్టరాదన్న ఆంక్షలతో మండల విద్యాశాఖ అధికారులు అత్యవసర సమయాల్లోనూ సెలవు మంజూరు చేయడం లేదని తెలియజేశారు. అంతేకాకుండా అనారోగ్యం బారిన పడిన వారికి సైతం సెలవులు మంజూరు చేయకపోవడం శివచనీయమని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల అపార్ నమోదులోనూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 10వ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక అంటూ ఆదివారాలు, పండుగ సెలవుల్లో సైతం పని చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయుల తరఫున తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఈ అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలనే డిమాండుతో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్ ) రాష్ట్రమంతా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించిందన్నారు. సంబంధిత అధికారులు తమ విజ్ఞప్తిని పరిశీలించి విద్యాశాఖ నిర్ణయాలను పునః సమీక్షించాలని, ఒత్తిడి లేని వాతావరణంలో ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకై పాటుపడేలా అధికారుల నిర్ణయాలు ఉండాలని కోరుతున్నట్లు చెప్పారు. దీన్ని సమీక్షించని పక్షంలో మా పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలియజేస్తూ మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయ శివారెడ్డి, అక్రం బాష, సుధాకర్, విశ్వనాథ రెడ్డి, వేణుగోపాల్, కృష్ణమూర్తి, ముని రెడ్డి, అంజి రెడ్డి, శ్రీనివాసులు, రమణయ్య, నాగసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హైందవ శంఖారావ బహిరంగ సభను జయప్రదం చేయాలి

**బద్వేల్ అర్బన్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :**

బద్వేలు టౌన్ అనంతగిరి నందు ఓంకారం స్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ జరుగుతున్న దృష్ట్యా అందుకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం బద్వేలు ఖండ హైందవ శంఖారావం కన్వీనర్ కొండపల్లి వెంకట సుభాష్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కన్వీనర్ వెంకట సుభాష్ కుమార్ మాట్లాడుతూ 2025 జనవరి 5వ తేదీన విజయవాడలో జరగబోవు హిందూ ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం నుండి విముక్తి చేయాలని, సనాతన హిందూ ధర్మరక్షణ కొరకు ప్రత్యేకమైన బోర్డు ఏర్పాటు చేయాలని, హిందూ ఆలయాలలో అన్యమతస్తులను తొలగించాలని, తిరుమల, శ్రీశైలం, అన్నవరం, విజయవాడ, శ్రీకాళహస్తి లాంటి ప్రధాన ఆలయ ప్రాంగణములో భక్తుల సౌకర్యార్థం అమ్మే పూజా సామాగ్రి షాపులు, హోటళ్ళు, వసతి గృహాలు మొదలైనవి హిందువులకు మాత్రమే టెండర్లు వేసి ఇవ్వాలని, భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా ప్రభుత్వం ఆధ్వర్యములో పూజలు, దర్శనాలు, ప్రసాద వితరణ జరగాలని, దేవాలయ భూములకు రక్షణ కల్పించాలి, అక్రమంగా కాజేసిన అన్యాక్రాంతం అయిన భూములను తిరిగి సంభదిత దేవాలయాలకు అప్పగించే భాధ్యత కొరకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని, ఆలయ కమిటీ సభ్యులలో అన్యమతాస్తులని నియమించరాదని మొదలైన ప్రధాన డిమాండ్లతో హైందవ శంఖారావం పేరుతో రాష్ట్రములోని హిందూ సంఘాల ఆధ్వర్యములో పార్టీలకు అతీతంగా గొప్ప బహిరంగ సభ జరుగుతున్న దృష్ట్యా కార్యవర్గంతో పాటు, గౌరవ జట్టు సభ్యులు బిజెపి, ఆర్ఎస్ఎస్, విహెచ్పి, ఎస్ ఎస్ ఎఫ్, ఏబీవీపీ, భజరంగ్ దళ్, ఆలయ ధర్మకర్తల కమిటీ, వినాయక ఉత్సవ కమిటీ, విగ్రహ,



అన్ని ఆలయాల నిర్వహణ కమిటీ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బద్వేలు ఖండ సంఘచాలక్ సి.రామకోటి రాజు, ఓంకారం స్థాపన గౌరవ కమిటీ సభ్యులు, బద్వేలు బద్దెన కళాపీఠం అధ్యక్షులు, గంగసాని సాంబశివారెడ్డి, గురుస్వామి బలపనూరు శంభూ ప్రసాద్, ఆర్య వైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కుప్పం వెంకట సుబ్బారావు, ఫ్రెండ్స్ సేవ సంఘం అధ్యక్షులు లాయం యోగా రాయల్, హిందూ సంఘాల నాయకులు కటారి రామయ్య, వాయలేటి సూర్య నారాయణ, చింతంరెడ్డి రామచంద్రా రెడ్డి, సి.వి. నాగేశ్వరరావు, బలిజ సంఘం ఉపాధ్యక్షులు పెరుగు వెంకటయ్య, ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వూరిబిండి జయారామి రెడ్డి, వర్తక సంఘం నాయకులు జయ మరియు ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్య నారాయణ శర్మ పాల్గొన్నారు.

# అనంతగిరి క్షేత్రంలో వైభవంగా ఓంకారం స్థాపన

**: దాతల సహకారం అభినందనీయం : పలువురు దాతలను సత్కరించిన కమిటి సభ్యులు**





**బద్వేలు అర్బన్, డిసెంబర్ 4 (ప్రభాతవార్త) :**

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని అనంతగిరి ఆలయాల క్షేత్రగిరిపై పలువురు దాతల సహకారంతో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఓంకార స్థాపన కార్యక్రమాన్ని బుధవారం ఓంకార క్షేత్ర అభివృద్ధి కమిటి అధ్యక్షులు గంగసాని వేణుగోపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు బలపనూరుశంభూ ప్రసాద్,ఉపాధ్యక్షులు ప్రభాకర్, సెక్రటరీ కటారు రామయ్య, ట్రెజరర్ సీవి.నాగేశ్వరరావు, కొండపల్లి సుభాష్‌కుమార్, సాంబశివారెడ్డి, కేవి.సుబ్బారావు, రామక్రిష్ణారెడ్డి, పోట్లదుర్తి రమేష్, వాయిలేటి సూర్యనారాయణలతో పాటు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు కనుమళ్ల సత్యనారాయణ శర్మ మంత్రోచ్ఛరణాల మధ్య ఓంకార స్థాపనను ప్రారంభించారు. జిల్లాలోనే మరెక్కడా లేని విధంగా బద్వేలు పట్టణంలో మొదటిసారిగా అనంతగిరిపై ఓంకార స్థాపన ప్రారంభించడం పట్ల ఓంకారాన్ని తిలకించేందుకు బద్వేలు పట్టణ పరిసరాల ప్రాంతాల నుంచి అనేకమంది ప్రజలు తరలివచ్చి దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకుని ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం ఓంకార క్షేత్ర అభివృద్ధి కమిటి సభ్యులు మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో ఓంకార స్థాపన నిర్మాణాన్ని కొండపై చేపట్టడానికి తమ కమిటి సభ్యులు ఎంతగానో కష్టపడి పనిచేసి ఓంకారాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందుకు తాము అడగగానే ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఓం అని ధ్వనియే ప్రణవం, ఓం అను అక్షరమే బీజాక్షరం, ఓంకారం దివ్యశక్తి, అకార, ఉకార, మకార త్రయాత్మకం, ఓం ఈ మూడు అక్షరాలు త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల సంకేతాలన్నారు. సృష్టి, స్థితి, లయాత్మక తత్వం ఇమిడి ఉన్న అక్షరం ఓంకారం పరమ శ్రేష్టమైన మంత్రమని మనం చేసే సకల దేవతల పూజలలో వేదమంత్రాల ఓం నామాన్ని ఆచరిస్తాం. ఓంకారం అనే జ్యోతిలోనే భూత, భవిష్య, వర్తమానాలు త్రికాలు ఇమిడి ఉన్నాయని,ఓం కారం వలన మనసుకు ఒక అపూర్వశక్తి కలుగుతుందన్నారు. ఇలాంటి ఓంకారాన్ని పలువురు దాతల సహకారంతో అందించడం బద్వేలు ప్రాంత ప్రజలకు అరుణాచలంలో గిరి ప్రదక్షిణను తలపించేలా అనంతగిరి క్షేత్రంలో ఓంకార స్థాపన వద్ద గిరి ప్రదక్షిణను ఏర్పాటు చేస్తామని, అలాగే ఆ ప్రాంతంలోనే ద్యానమందిరం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం సహకరించిన దాతలందరికీ సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్త సరు క్యులేషన్ మేనేజర్ న్యామర్స్ వెంకటేశ్వరరావు, సతీమణి నాగపార్వతి, వల్లంకొండు వెంకటరమణ , సతీమణి ధనలక్ష్మి, దొంతంశెట్టి జయకుమార్, లాయం యోగయ్య, రాజశేఖర్, దద్దం వెంకటేశ్వర్లు, కొంకుల వెంకటరమణ, పెరుగు వెంకటయ్య, బీజేపీ జిల్లా నాయకులు సుబ్బారెడ్డి, గోనుగుంట్ల వెంకటసుబ్బారెడ్డి,కె.నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, పోట్లదుర్తి శ్రీనివాసులు, బైసాని శివశంకర్‌రెడ్డి, చింతంరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు 108 మంది శాశ్వత సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన మునిసిపల్ కమీషనర్



**బద్వేల్ అర్బన్ ,డిసెంబర్ 4 (ప్రభాతవార్త) :**

బద్వేలు పట్టణ పరిధిలోని గాంధీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మునిసిపల్ కమీషనర్ ఒక నరసింహారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ప్రజలకు అందించే వైద్యసేవలు ,రికార్డులు నిర్వహణ అంశాలపై డాక్టర్ శరత్ చంద్ర మరియు పీహెచ్ సి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ల్యాబ్, ఫార్మసీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు అందులో భాగంగా ఆరోగ్య కేంద్రమునకు వచ్చేప్పుడు ఆధార్ కార్డు మరియు ఆధార్ కు లింకు అయిన మొబైల్ నంబర్ గల మొబైల్ తప్పక తీసుకొనిరావలెనన్నారు.మొబైల్ ఎందుకంటే వారి ఆధార్ తో వారి ఆరోగ్య వివరాలు, వాడే మందులు ఆన్లైన్ అయి ఉన్నందున వారి వివరములు తెలుసుకునేందుకు మరియు వైద్యము చేసిన తర్వాత వివరాలు నమోదు చేయుటకు అవసరం అని తెలిపారు.పురపాలక సంఘం లోని నాలుగు ఆరోగ్యకేంద్రాలలో తగినంత మంది సిబ్బందితో పాటు అన్నిపరీక్షలు (లిక్విడ్ ప్రొఫైల్, కిడ్నీ ఫంక్షన్ టెస్టు, లివర్ ఫంక్షన్ టెస్టు, షుగర్ మొదలయిన అన్నిరకాల టెస్టులు )అధునాతనమైన పరికరాల ద్వారా ఉచితముగా చేసి మందులు కూడా ఉచితముగా ఇస్తారన్నారు.ఒకవేళ ఎవరికయినా టెస్టులలో తేడాలు ఉండి స్పెషలిస్ట్ డాక్టర్ అవసరము అయితే టెలి మెడిసిన్ సౌకర్యము కూడా ఉంటుందన్నారు. కావున ప్రభుత్వం ఉచితముగా కలిపించే ఈ సౌకర్యాలను బద్వేల్ పురపాలక సంఘము ప్రజలు సద్వినియోగము చేసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు బజారును తెరిపించండి



**వేంపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త :**

ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లి పట్టణం లో రూ.కోటి వ్యయంతో నిర్మించిన రైతుబజారును తెరిపించాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. బుధవారం వేంపల్లికి వచ్చిన కడప జిల్లా పంచాయితీ అధికారి గండికోట రాజ్యలక్ష్మిని ఆయన కలిశారు. అయన మాట్లాడుతూ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రయివేటు స్థలంలో ఉన్న మార్కెట్ ను తీసివేసి రైతుబజారుకు తరలించాలని జిల్లా సంయుక్త కలెక్టరు అతిథి సింగ్ ఇచ్చిన ఆదేశాలను అమలు పరచాలని కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రైతు బజారు తెరిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ బలోపేతం



ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ బి 445 బి ఎం ఎస్ సర్వసభ్య సమావేశంలో చౌటపల్లి రామ్ గోపాల్ రెడ్డి రాష్ట్ర నాయకులు వారి ఆధ్వర్యంలో పలు అనుబంధ సంస్థలు నుండి ఈరోజు సుమారు 70 మంది యూనియన్ సభ్యులుగా చేరడమైనది నూతన రాష్ట్ర కమిటీ నాయకులను ఎన్నుకోవడం జరిగింది రాష్ట్ర అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీగా కంపా జయప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏ లక్ష్మయ్య ,జిల్లా అధ్యక్షునిగా ఎస్ దేవేందర్ రావు, జిల్లా జనరల్ సెక్రెటరీగా మునిరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎల్లమ్మ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ గా ముత్తయ్య, జాయింట్ సెక్రెటరీగా సరిత అమ్మ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అయోధ్య రామయ్య, రీజినల్ ట్రెజరర్ గా అరుణ్ కుమార్ ఇతర జిల్లా నాయకులను ఈ సమావేశంలో పాల్గొన్న వారికి కండువాలు వేసి యూనియన్‌లోకి ఆహ్వానించడం అయినది వారు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ ఐదు జిల్లాలకు బిఎంఎస్ అనుబంధ సంస్థ యూనియన్ నాయకులు ఆంధ్ర రాష్ట్ర పవర్ యూనియన్ బలోపేతం చేస్తామని మీ అందరి సహకారంతో పలు సమస్యలు ఏవి ఉన్నను అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతామని తెలియజేశారు.

# భారీ వర్షాలు - నిండిన చెరువులు

**రాజంపేట,డిసెంబర్ 04,ప్రభాత వార్త :**

రాజంపేట డివిజన్ పరిధిలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లోని చిన్న పెద్ద సాగునీటి చెరువులు నిండిపోయాయి. ఈ వర్షంతో రెండు నియోజకవర్గాల్లో వాగేటి కోన, శెట్టి గుంట, ఉప్పరపల్లె, వై కోట, ఎల్లంరాజు చెరువు, నాగవరం, మొక్కల చెరువు, కొర్లకుంట, జిల్లేల మడక, రెడ్డి పల్లె, పించా ప్రాజెక్టు, రంగం పల్లి, అన్నసముద్రంతో పాటు సుమారు 32 చెరువులు, నిండి అలుగులు పొర్లుతున్నట్లు సంబంధిత ఇరిగేషన్ శాఖ ఎస్‌సి వెంకట్రామయ్య బుధవారం తెలిపారు. జిల్లాలోనే చిన్న, పెద్ద చెరువులు కలసి 3,220 సాగు నీటి చెరువులు ఉన్నాయన్నారు. వీటిలో 100 ఎకరాలకు ఆయకట్టు కు పైన ఉన్న చెరువులు 167 ఉన్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని చెరువులు నిండితే మంగళవారం వర్షాలు కొంచం తగ్గినట్టు ఉన్నప్పటికీ బుధవారం ఉదయం నుంచే రాజంపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయన్నారు. దీంతో పెద్ద చెరువులైన పోలి, పెద్దఓరంపాడు, కూడా దాదాపు నిండే పరిస్థితికి వచ్చాయన్నారు. ఫించా చెరువు నిండి గేట్లు కూడా ఎత్తివేయడం జరిగిందన్నారు. రైల్వే కోడూరు మండలంలో 18 చెరువులు ఉంటే 16 చెరువులు పూర్తిగా నిండిపోయాయన్నారు. అదేవిధంగా రాజంపేట, నందలూరు మండలాల్లో 30 చెరువులు ఉన్నారని వీటిలో కూడా దాదాపు సగానికి పైనే 70శాతం నీరు చేరగా, కొన్ని పూర్తి స్థాయిలో నిండి అలుగులు పొర్లుతున్నాయన్నారు. అయితే ఎక్కడా



చెరువులు ప్రమాదాలకు గురి కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని చిట్వేల్ మండలంలో అత్యధికంగా 33.2 మిల్లీమీటర్లు వర్షం నమోదైందన్నారు. జిల్లాలోనే మొత్తం మీద సాగునీటి చెరువులన్నింటికీ జలకల వచ్చిందని ఈ ఏడాది రైతులకు చెరువులు నిండి సంవృద్దిగా నీరు ఉండడమే కాకుండా బోర్లలో కూడా నీటి మట్టం బాగా పెరిగిందని అన్నారు. జిల్లాలో ఈ ఏడాది కరువు చాయలు లేనట్లే అని తెలిపారు. వర్షం ఇంకా రెండు రోజులు ఉందనడంతో జిల్లాలోనే 50శాతానికి పైగా చెరువులు పూర్తిగా నిండే పరిస్థితులు ఉన్నాయని అన్ని చెరువులకు నీరు కూడా పుష్కలంగా చేరుతాయన్నారు. తెగిన పెనగలూరు చెరువు కూడా 3 మీటర్ల వరకు నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు.

# రేపటి నుండి రెవెన్యూ సదస్సులు



**చాపాడు, డిసెంబర్ 09, ప్రభాతవార్త:**

గ్రామ స్థాయిలో భూ వివాదాల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమా కుమారి తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులు 6వ తేది నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఉపాధిలో రికార్డులు సక్రమంగా ఉంచాలి



**దువ్వూరు, డిసెంబర్ 04, ప్రభాతవార్త:**

ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది రికార్డులను సక్రమంగా ఉంచాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా 25 పశువుల షెడ్లు మంజూరు అయ్యాయని వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో భాగంగా సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్నాయని వాటిని పర్యవేక్షించాలన్నారు. ఎప్పటికప్పుడు మస్టర్‌లు, జాబ్ కార్డులు సరిచేయాలని తెలిపారు. ఈ సమీక్షలో ఏపీఓ వసంతకుమార్, ఈసీ ప్రియాకం, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పడిపూజ మహోత్సవం

**మదనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :**

స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పడిపూజ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అయ్యప్పనామస్మరణలతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి. శబరిమల మాలకపురం మేల్ తంత్రి మనోజ్‌స్వామి ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, రంగు రంగు విద్యుత్ దీపాలతో సర్వంగ సుందరంగా అలంకరించారు. ఆలయంలోని పద్దెనిమిది మెట్లను వివిధ రకాల పుష్పాలు, నేతి దీపాలు, చందన, కుంకుమ, ఫలాలతో సుందరంగా తీర్చిదిద్దారు. కేరళ సంప్రదాయ పద్దుతులతో ప్రతి మెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పడిమెట్లు పూజోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అయ్యప్పస్వామి భజనలు, భక్తులను అలరించాయి. పడిమెట్లు పూజ అనంతరం అయ్యప్పస్వామికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు విజయలక్ష్మి భాస్కర, జర్మన్‌రాజు, భగవాన్, శివమూర్తి, మల్లేనాయక్, మహేష్, హేమంత్, బాలక్రిష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పూడిపూజ చేస్తున్న శబరిమలూఐ మాలికపురం మేల్‌శాంతి మనోజ్‌స్వామి

# రేపటి నుంచే రెవెన్యూ సదస్సులు

**రాజంపేట,డిసెంబర్ 04,ప్రభాత వార్త :**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టే రెవెన్యూ సదస్సులు ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని మండల తాహశీల్దార్ పీర్మున్ని ఒక ప్రకటన ద్వారా విడుదల చేశారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ రెవెన్యూ సదస్సులు వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు జరుగుతాయని మండలంలోని రైతులందరూ ఆయా పంచాయితీలలో జరిగే రెవెన్యూ సదస్సులో పాల్గొని వారి సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సులో మండలంలోని అన్ని పంచాయితీలలో ఉదయం 9.00గంటల నుంచి సాయంత్రం 5.00గంటల వరకు నిర్వహించి ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 6వ తేదీన ఎంజీ పురం,తాళ్లపాక, 7వ తేదీన హస్తవరం, 10వ తేదీన హస్తవరం కొత్తపల్లి, 12వ తేదీన గుండ్లూరు, 13వ తేదీన మందపల్లి, 7వ తేదీన శేషమాంబపురం, 18వ తేదీన పులపుత్తూరు, 19వ తేదీన ఆకేపాడు, 20వ తేదీన శ్రీరంగరాజపురం, 21వ తేదీన బ్రాహ్మణపల్లి, 24వ తేదీన మన్నూరు, 26వ తేదీన బహిరాజుపల్లి, 27వ తేదీన రాజంపేట వరదయ్యగారిపల్లె, 28వ తేదీన రాజంపేట కూచివారిపల్లి, 31వ తేదీన మిట్టమీదపల్లి,జనవరి2 వ తేదీన గోపమాంబపురం,జనవరి3వ తేదీన పోలి అప్పయ్యరాజు పేట, జనవరి4వ తేదీన పోలి,జనవరి 7వ తేదీన ఊటుకూరు, జనవరి 8వ తేదీన రోళ్లమడుగు, ఆర్,బుడుగుంటుపల్లి, జనవరి9వ తేదీన సీతారంపురం, కిచ్చమాంబపురంలో నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

# ఆరు మందికి సీఎం సహాయనిధి 10.28లక్షలు మంజూరు-సుగవాసి

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 04, ప్రభాతవార్త:**

రాజంపేట నియోజకవర్గంలో ఆరోగ్య పరిస్థితులు బాగలేకపోవడంతో సీఎం సహాయనిధి 10.28లక్షలు మంజూరైనట్లు రాజంపేట టీడీపీ ఇంచార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. కంచం వెంకటరమణకు 3.38లక్షలు, మోడెం సునిత, గుండ్ల భక్తకుచేలయ్యలకు 30వేల చొప్పున, అబ్బురి కృష్ణయ్యకు 55వేల 178, ఒంటిమిట్ట గంగయ్యకు 3.53లక్షలు, గడ్డి భువనేశ్వరికి 2.50లక్షలు మంజూరైనట్లు బాలసుబ్రమణ్యం తెలిపారు.

# శుక్రవారం నుండి రెవెన్యూ సదస్సులు

**ఖాజీపేట, డిసెంబర్ 04, ప్రభాతవార్త:**



ఖాజీపేట మండలంలో 6వ తేది నుండి 02.01.2025వ తేది వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. 6వ తేదిన కొమ్మలూరు, 7న త్రిపురవరం, 10న ఏటూరు, 11న తవ్వారిపల్లె, 12న బి.కొత్తపల్లి, భూమాయ పల్లి, 13న ఖాజీపేట, 17న పత్తూరు, 18న పుల్లూరు, 19న అప్పనపల్లి, 20న నాగసాని పల్లె, 21న రావులపల్లి, 24న దుంపలగట్టు, 26న చెన్నముక్కపల్లి, 28న మిడుతూరు, 31న చెముళ్లపల్లి, కొత్తపేట చివరగా జనవరి 2వ తేదిన బుడ్డాయపల్లి గ్రామాలయం నందు రైతు సదస్సులు నిర్వహించబడుతుందని తెలిపారు. రైతులందరూ వారి భూములకు సంబంధించి ఏవైనా సమస్య ఉన్నచో తెలియజేసినచో వాటిని పరిష్కారం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారని, కావున ఈ అవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గండికోట పర్యాటక అభివృద్ధికి అడుగులు

**కడప, డిసెంబర్ 4 : ప్రభాతవార్త:**

ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.బుధవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో.. జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, సంబంధిత ప్రాజెక్టు ఏజెన్సీతో కలిసి గండికోట పర్యాటక అభివృద్ధిపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన పర్యాటక ప్రాంతమైన "గండికోట పర్యాటక కేంద్రం" భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాసిస్తుందని తెలిపారు. ఆ దిశగా ఇప్పటికే గండికోట డెవలప్మెంట్ కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం జరుగుతోందన్నారు. గండికోట యొక్క వారసత్వం, సంస్కృతి ప్రతిబింబించే విధముగా ప్రత్యేకమైన, సృజనాత్మకమైన నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. పర్యాటకం అనేది..






ప్రజలకు వినోదంతో పాటు వారి భద్రత, సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పోలీసు భద్రతలో భాగంగా 24/7 అందుబాటులో ఉన్న ఒక ఔట్ పోస్టు నిర్వహణలో ఉందన్నారు. పోలీసు, రెవెన్యూ, టూరిజం శాఖల సమన్వయంతో పర్యాటక కేంద్రంలో పర్యాటకులకు సంతృప్తి కరమైన ఏర్పాట్లను కల్పిస్తున్నామన్నారు. అనంతరం గండికోట పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు రిపోర్టుకు సంబందించిన వివరాలను పిపిటి ద్వారా కలెక్టర్ పరిశీలించి టూరిజం శాఖ అధికారికి పలు సూచనలు ఇచ్చారు.